## తడిసి ముద్దైన బెంగళూరు సిటీ.. ఎండ నుంచి ఉపశమనం

న్యూఢిల్లీ, మే 3 దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కంటే ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఇలాంటి సమయంలో పలు చోట్ల వర్షం ఉపశమనాన్ని కలిగిస్తోంది. కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో శుక్రవారం వర్షం పడింది. దీంతో సిలికాన్ సిటీ వర్షంతో తడిసి ముద్దైంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి.

గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో అల్లాడుతున్న నగరవాసులకు తాజాగా కురిసిన తేలికపాటి వర్షం కాస్త ఉపశమనాన్ని కలిగించినట్లైంది. గురువారం కూడా నగరంలో వర్షం పడింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలను నగర ప్రజలు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. 'బెంగళూరులో ఎట్టకేళకు వర్షం కురిసింది..', 'ఈ వర్షంతో ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం లభించింది' అంటూ వీడియోలకు క్యాప్షన్ ఇచ్చారు.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


### చురక

అబద్ధమో నిజమో
అంతా అయోమయం
రిజర్వేషన్ల భవితపై
రేపేమిటో కలిగే భయం

ఎన్నికల్లో ఓట్ల కొరకు
ఎన్నెన్నో చెప్పేస్తరు
అవునన్నా కాదన్నా
అనుకున్నదే చేసేస్తరు



-వేల్పుల నారాయణ


హైదరాబాద్ శనివారం 4-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి:30 సంచిక:210 పేజీలు:6 వెల: రూ.1/-


## కరెంట్ అడ్డుపెట్టుకుని దోచుకున్న దొంగ కెసీఆర్ - మంత్రి పొంగులేటి

**-విద్యుత్ కొనుగోలులో అన్ని అక్రమాలే**
**-బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటే**
**-ఈ రెండు పార్టీలను ఏడు అడుగుల గోతిలో పాతాల్సిందే..**



ఖమ్మం, మే 3(నేటినిజం ప్రతినిధి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వన్ని దొంగ మాటలు అని మండిపడ్డారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని ఆ రెండు పార్టీలను ఏడు అడుగుల లోతుల గొయ్యి తీసి పాతి పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఖమ్మం జిల్లా తిరుమల పాలెం మండలం దమ్మాయిగూడెం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ నేడు నిర్వహించిన కార్నర్ మీటింగ్ మంత్రి మాట్లాడుతూ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో మోసం చేసిన బీజేపీని కెసిఆర్ ఎందుకు నిలదీయలేదన్నారు. బీజేపీని ప్రశ్నిస్తే జైల్లో పెడతారని కెసిఆర్ కు భయమన్నారు.

పగలు తిట్టుకోవడం రాత్రిపూట బతిమాలు కోవటం కెసిఆర్ కు అలవాటంటూ వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలోనే కాదు దేశంలో ఒక్క సీటు రాని కేసీఆర్ ఖమ్మంలో నామా గెలిస్తే కేంద్ర మంత్రి ఎలా చేస్తారు.. అని ప్రశ్నించారు. దీంతో బీజేపీతో పొత్తు ఉందని చెప్పకనే చెబుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ మంచినీళ్ల కోసం ఇబ్బంది పడొద్దన్నారు. తన నియోజకవర్గంలోనే కాదు రాష్ట్రంలో ఎక్కడైనా ఇబ్బంది పడనీయకుండా చూసుకునే బాధ్యత నాది అన్నారు.

కాంగ్రెస్ వచ్చింది కరెంటు పోయింది అంటున్న కేసీఆర్.. మొట్టమొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు మూడు రూపాయల యూనిట్ని 20 రూపాయిలకు కెసిఆర్ కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం యూనిటీ మూడు రూపాయల 50 పైసలకే కరెంటు కొంటున్నామన్నారు. కరెంటుని అడ్డం పెట్టుకొని అడ్డంగా దోచుకుంది కేసీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు.

## 5న హైదరాబాద్‌కు అమిత్ షా.. ఈటెల

హైదరాబాద్, మే2: ఈనెల 5వ తేదీన కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ వొస్తున్నట్లు మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ తెలిపారు. శుక్రవారం కంటోన్మెంట్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల పరిధిలోని బహిరంగ సభ 5వ తేదీన పరేడ్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్నామన్నారు.

ఈ బహిరంగ సభకు అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఈటెల రాజేందర్ తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేసారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లు భేతి శుభాష్ రెడ్డి, ఎన్వీఎస్ ప్రభాకర్, నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, మల్లికార్జున్, బీఎన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్, మే 3:నాగర్ కర్నూల్ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో నిర్వహించే భారీ బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అండ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు.

ఈనెల 5వ తేదీన జోగులాంబ గద్వాల జిల్లాకు ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరవుతున్న ఎర్రవల్లి చౌరస్తాలో సభాస్థలిని మంత్రి జూపల్లి కృష్ణారావు, జెడ్పి చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇంచార్జీ సరిత తిరుపతయ్య, వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ పరిశీలించారు.

అనంతరం వారు మాట్లాడుతూ మే 5న నడిగడ్డలో జరిగే లోక్ సభ



ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ బహిరంగ సభ విజయవంతం చేయుటకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు జన సమీకరణ చేయనున్నట్లు, తదితర అంశాలపై మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## మొగులయ్యను ఆదుకుంటాం ..కెటిఆర్

**-రోజు వారి కూలీగా మారిన కిన్నెర వాయిద్య కారుడు**
**-పద్మశ్రీ అవార్డు వచ్చినా అందని పెన్షన్**
**-ఆర్థిక ఇబ్బందులతో సతమతం**
**-స్పందించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

హైదరాబాద్, మే2: ఆర్థిక ఇబ్బందులతో పద్మశ్రీ అవార్డ్ గ్రహీత, ప్రముఖ జానపద కళాకారుడు మొగుల్లయ్య రోజువారీ కూలీగా మారారు. ప్రభుత్వం నెలనెలా ఇచ్చే రూ.10 వేల పెంచన్ ఆగిపోవడం, గత ప్రభుత్వం ఇచ్చిన కోటి రూపాయలతో తన పిల్లల వివాహాలు చేయడంతో పాటు, హైదరాబాద్ సమీపంలో ఉన్న తుర్కాయాంజల్‌లో ఓ ప్లాట్ కొని ఇల్లు కట్టడంతో డబ్బులు అన్నీ ఖర్చు అయిపోయాయి. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతోన్న మొగులయ్య రోజువారీ కూలిగా మారి పనులకు వెళ్తున్నారు. తాజాగా మొగులయ్య సాధారణ కూలీగా పని చేస్తోన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

తన టాలెంట్‌తో దేశ అత్యున్నత అవార్డుల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డ్ గెల్చుకున్న మొగులయ్య రోజు వారి కూలీగా మారడం చూసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చెలించిపోయారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మొగులయ్యకు కేటీఆర్ కీలక హామీ ఇచ్చారు. "మొగులయ్య కుటుంబాన్ని నేను వ్యక్తిగతంగా ఆదుకుంటాను. నా కార్యాలయ సిబ్బంది వెంటనే మొగులయ్య వద్దకు వెళ్తారు" అని కేటీఆర్ ట్వీట్ చేశారు. మొగులయ్య రోజు వారీ కూలీగా మారిన విషయాన్ని తన దృష్టికి తెచ్చిన నెటిజన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## రాయ్‌బరేలి బరిలో రాహుల్..కాషాయ పార్టీలో కలవరం : జైరాం రమేష్

న్యూఢిల్లీ, మే 3యూపీలోని రాయ్‌బరేలి, అమేథి నియోజక వర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన అనంతరం పార్టీ నిర్ణయాన్ని సీనియర్ నేత జైరాం రమేష్ సమర్థించారు. రాయ్‌బరేలి నుంచి రాహుల్ గాంధీని బరిలోకి దింపడం బీజేపీ ఆ పార్టీ మద్దతుదారులకు షాక్‌కు గురిచేసిందని వ్యాఖ్యానించారు.

రాయ్‌బరేలి నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తారనే వార్తలపై ఎంతో మందికి ఎన్నో అభిప్రాయాలున్నాయని, రాజకీయాల్లో, చెస్‌లో ఆయన ఎంతో అనుభవమున్న ఆటగాడని మరవరాదని జైరాం రమేష్ అన్నారు. విస్తృత చర్చ అనంతరం భారీ వ్యూహం, ఎత్తుగడల్లో భాగంగా పార్టీ నాయకత్వం ఈ నిర్ణయాలు తీసుకుందని అన్నారు. ఈ నిర్ణయం బీజేపీ సహా దాని మద్దతుదారులను వణికిస్తోందని జైరాం రమేష్ ట్వీట్ చేశారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశిస్తూ అపర చాణుక్యుడిగా చెప్పుకునే బీజేపీ నేతకు ఇప్పుడెలా స్పందించాలో తెలియడం లేదని అన్నారు. రాయ్‌బరేలి చాలాకాలంగా ఇందిరా గాంధీ, సోనియా గాంధీల స్థానం మాత్రమే కాదని, ఇది వారసత్వం కాదని, ఇది బాధ్యత అని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. గాంధీ కుటుంబానికి అమేథి-రాయ్‌బరేలి మాత్రమే కాదని, ఉత్తరాది నుంచి దక్షిణాది వరకూ దేశమంతా కాంగ్రెస్‌కు పట్టుందని పేర్కొన్నారు

## శ్రీశైల దేవస్థానం వైద్యశాలకు రూ. 16 లక్షల విలువ గల పరికరాలు అందజేత

## భయపడకు.. పారిపోకు.. రాహుల్‌కు మోదీ కౌంటర్

న్యూఢిల్లీ, మే 3 కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే అమేథీ స్థానాన్ని వీడి ఆయన.. రాయ్‌బరేలీ నుంచి పోటీకి సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఇవాళ జరిగిన ఓ సభలో మాట్లాడుతూ రాహుల్ గాంధీకి కౌంటర్ ఇచ్చారు. బెంగాల్‌లో జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ.. ఓడిపోతానన్న భయంతోనే రాహుల్ గాంధీ అమేథీ స్థానాన్ని విడిచి వెళ్లినట్లు ప్రధాని ఆరోపించారు. ఇవాళ రాహుల్‌కు ఒక విషయం చెప్పాలనుకుంటున్నానని, డరో మత్.. భాగో మత్ అని ప్రధాని అన్నారు. భయపడవద్దు.. పారిపోవద్దు అని మోదీ పేర్కొన్నారు.

ఇటీవల బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కారును రాహుల్ పదేపదే విమర్శించారు. ఈడీ, సీబీఐ లాంటి సంస్థలతో దాడు చేస్తున్నట్లు ఆయన ఆరోపిస్తూ.. ఎవరూ భయపడవద్దు అంటూ పేర్కొన్నారు. అయితే రాహుల్ చేసిన ఆ వ్యాఖ్యలను ఇప్పుడు ఆయనకే ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ విమర్శలు చేశారు. సోనియా గాంధీని కూడా ఆయన వదల్లేదు. తల్లీకొడుకులు ఇద్దరూ తమ స్థానాన్ని వదలివేసి పారిపోయినట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆ పార్టీకి చెందిన పెద్ద నేత కూడా పోటీ చేయదని చెప్పానని, ఆమె భయంతో పారిపోయా ఓరని, రాజస్థాన్‌కు వెళ్లి రాజ్యసభ నుంచి పోటీ చేశారని మోదీ అన్నారు.

వయనాడ్‌లో కూడా రాహుల్ ఓటమి ఖరారు అవుతుందని, ఓటింగ్ ముగిసిన తర్వాత రాహుల్ మూడవ సీటు గురించి ప్రయత్నం మొదలుపెడుతారని, అమేథీలో ఓటమి భయం వల్ల.. రాయ్‌బరేలీకి వెళ్లారని, భయపడవద్దు అంటూ దేశం అంతా తిరుగుతూ చెబుతున్న ఆ నేతలకు తానో విషయాన్ని చెప్పాలని భావిస్తున్నానని, మీరెవరూ భయపడవద్దు అని, ఎవరూ పారిపోవద్దు అని కాంగ్రెస్ నేతకు మోదీ కౌంటర్ ఇచ్చారు.

## రాష్ట్రంలో మండుతున్న ఎండలు.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు

హైదరాబాద్, మే 3:రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగకు ప్రజలు విలవిలలాడి పోతున్నారు. మండుటెండలకు ఉక్కపోత కూడా తీవ్రమైంది. దీంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇవాళ రాష్ట్రంలో 46 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదు పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో 46.7, జగిత్యాల జిల్లాలోని నేరెళ్లలో 46.7, సూర్యాపేట జిల్లాలోని మునగాలలో 46.7, ఖమ్మం జిల్లాలోని పమ్మిలో 46.7, నల్లగొండ జిల్లా కామారెడ్డిగూడెంలో 46.6, మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్‌లో 46.5, కరీంనగర్ జిల్లాలోని వీణవంకలో 46.5, మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రంలో 46.4, నారాయణపేట జిల్లా ఉట్కూరులో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా భానుడు తన ప్రతాపం చూపించాడు. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 46.7 డిగ్రీలు, నల్లగొండ జిల్లా కామారెడ్డిగూడెంలో 46.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మరో 29 ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైన ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సూర్యాపేట జిల్లాలో 17 ప్రాంతాల్లో, యాదాద్రి జిల్లాలో 6 ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

## రాగిడి లక్ష్మారెడ్డి గళం.. మల్కాజ్‌గిరికి బలం : కేటీఆర్

హైదరాబాద్, మే 3:బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఈ ఎన్నికల్లో గెలిపిస్తేనే మల్కాజ్‌గిరికి బలం చేకూరుతుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి చేపట్టిన పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలను కేటీఆర్ ట్వీట్ చేశారు. పార్లమెంట్‌లో రాగిడి లక్ష్మారెడ్డి గళం.. మల్కాజ్‌గిరికి బలం చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గానికి ఏనాడు ఏమీ చేయని, కనీసం ఈ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ -నారాపల్లి ఫ్లైఓవర్‌ని కూడా పూర్తి చేయలేకపోయిన బీజేపీకి ఓటేయాలా? అని నిలదీశారు. లేక గత ఎన్నికల్లో గెలిపించినప్పటికి.. ఒక్కరోజు కూడా లోక్‌సభలో మల్కాజిగిరి సమస్యల గురించి ప్రస్తావించని కాంగ్రెస్ పార్టీకి మద్దతియ్యాలా.. లేక మల్కాజ్‌గిరి పార్లమెంట్ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడి.. ఇప్పుడు ఒక సామాన్య కార్యకర్తకు ఎంపీగా అవకాశమిచ్చిన బీఆర్ఎస్ పార్టీని బలపరచాలా..?మల్కాజ్‌గిరి ఓటర్లు తేల్చుకోవాల్సిన తరుణం ఇది అని కేటీఆర్ పేర్కొన్నారు.మన బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేసి, దాదాపు మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి రాగిడి లక్ష్మారెడ్డి. తన తల్లి పేరు మీద మధుర చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి 50 వేల మందికి పైగా సేవలందించారు. కేసీఆర్ ఆశీర్వాదంతో మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి అనే ఒక సామాన్య నాయకుడు.. రాజకీయంగా సీనియర్ నాయకులైన ఈటల రాజేందర్, సునీతా మహేందర్ రెడ్డి పోటీకి దిగారు. బీజేపీ నుండి ఈటెల రాజేందర్ ఒక వైపు, కాంగ్రెస్ నుండి పట్నం సునీతా రెడ్డి మరో వైపు.. వీళ్ళు ఇద్దరూ మల్కాజ్‌గిరికి చేసిందేమీ లేదు.. చేసేదేమి లేదు. వారిద్దరికి అధికార దాహం తప్ప మరొకటి లేదు. లక్ష్మారెడ్డి గెలిస్తే ఒక సామాన్యుడి గొంతు లోక్‌సభలో వినబడుతుంది. మన మల్కాజ్ గిరి అభివృద్ధి పథాన నిలుస్తుందని కేటీఆర్ తెలిపారు.

## కాషాయ పార్టీని మట్టికరిపించి అధికారంలోకి వస్తాం : అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ, మే 3 లోక్‌సభ ఎన్నికల్లో కాషాయం పార్టీని మట్టికరిపించి విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని, మన హక్కులను కాపాడుకునేందుకు విపక్ష కూటమి సర్వశక్తులూ ఒడ్డుతుందని స్పష్టం చేశారు. యూపీలోని సైఫైలో శుక్రవారం ఓ వార్తాసంస్థతో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు.

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్న బీజేపీని దీటుగా నిలువరిస్తామని చెప్పారు. రాయ్‌బరేలి నుంచి నామినేషన్ దాఖలు చేసిన రాహుల్ గాంధీకి అఖిలేష్ మద్దతు పలికారు. కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలి నుంచి నామినేషన్ వేసిన రాహుల్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

మరోవైపు రాహుల్ రాయ్‌బరేలి నుంచి పోటీ చేయడంతో కాషాయ పాలకులు భయపడుతున్నారని, అందుకే వారు కుటుంబం, కుటుంబ పార్టీ అంటూ విమర్శలు గుప్పిస్తున్నారని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ భార్య, మొయిన్‌పురి ఎస్పీ అభ్యర్థి డింపుల్ యాదవ్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని మోదీ ప్రభుత్వం కోరుకుంటోందని ఆమె ఆరోపించారు.

## అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసు.. విచారణపై స్టే విధించిన హైకోర్టు

న్యూఢిల్లీ, మే 3కేంద్ర హోంమంత్రి అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు. స్టే విధించింది. తదుపరి విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేస్తూ? ఈ కేసులో ముందస్తు విచారణ చేపట్టవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

రిజర్వేషన్లు ఎత్తివేస్తాం అంటూ అమిత్ షా మాట్లాడినట్లుగా ఓ మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇందుకు బాధ్యులైన ఐదుగురిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే దీనిపై కాంగ్రెస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ముందస్తు చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం ప్రాథమిక విచారణ చేపట్టవద్దని ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఇక ఈ కేసులో సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసిన ఐదుగురికీ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

## తెలుగు రాష్ట్రాల్లో మరో 4 రోజులు వడగాలుల తీవ్రత

హైదరాబాద్, మే 3:భానుడి ప్రతాపంతో ఎండలు భగ్గుమంటుంటే గత రెండు రోజులుగా వడగాలులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పగలు 10 గంటలు దాటితే బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత కూడా వేడిగాలి సెగలు రేపుతోంది. పిల్లలు, వృద్ధులూ వడగాడ్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇక మరో నాలుగు రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వడగాల్పుల ప్రభావం కొనసాగుతుందని ఐఎండీ హెచ్చరించింది. ఇక తూర్పు ప్రాంతంలో వడగాలులు మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఐఎండీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కుమార్ హెచ్చరించారు.

## మణిపుర్ ఎన్నటికీ భారత్‌లో అంతర్భాగమే..

**- కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన..**

న్యూ డిల్లీ మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మణిపుర్ ఎన్నటికీ భారత్‌లో అంతర్భాగమేనని .. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేసారు. ఎవరి ఎన్ని కుట్రలు చేసినా మణిపుర్ ను దేశం నుంచి వేరు చేసేందుకు తాము ఎన్నటికీ ఒప్పుకోబోమని స్పష్టం చేశారు.చొరబాటు ద్వారా మణిపుర్ జనాభాను మార్చే ప్రయత్నాలు జరిగాయని అన్నారు.. మణిపుర్ ను విచ్ఛిన్నం చేసే శక్తులు, ఐక్యం చేసే శక్తుల మధ్య లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. ఇంఫాల్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా ఈ కామెంట్లు చేశారు. రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మణిపూర్ సీఎం బీరెన్ సింగ్ వెల్లడించారు. షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదా కోసం మైతేయి డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాల్లో గిరిజన సంఘీభావ యాత్ర జరిగింది. గతేడాది మే 3న జరిగిన ఈ సంఘటన తీవ్ర హింసాత్మకంగా మారింది. ఘర్షణలు చెలరేగి 219 మంది మృతి చెందారు. మహిళలను వివస్త్రలు చేసి నగ్నంగా ఊరేగించిన వీడియోలు దేశ వ్యాప్తంగా పెను దుమారం రేపాయి. మహిళలపై అత్యాచారం, దాడులతో మణిపుర్ అట్టుడికిపోయింది. గత వారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అస్సాంకు చెందిన ఒక వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ రాష్ట్రంలో పరిస్థితి మెరుగుపడిందని చెప్పారు. వివాదాన్ని పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. దేశమంతా వారి వైపే ఉందని మణిపుర్ ప్రజలకు భరోసా ఇచ్చారు. అందరం కలిసి ఈ సమస్యను పరిష్కరిస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

### నేటి కందం - నేటికీ అందం

శుభములు జయములు జరుగగ
నిభవక్త్రుడు దయ నరయగ"నిచ్చుట" వలనన్
నభసము నంటగ కీరితి
విభవముతో జరుపవలయు వితరణ దినమున్

( మే 4 : ప్రపంచ వితరణ దినం)



-రాధశ్రీ
సెల్:9494481210


ఆహ్వానం

అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ హైదరాబాద్
తెలంగాణ శాఖ మరియు
అశోక్‌నగర్ కల్చలర్ & వెల్ఫేర్ అసోసియేషన్
"శ్రీ క్రోధి ఉగాది కవితా కదంబం"
గ్రంథావిష్కరణోత్సవం

తేది : 5-5-2024, ఆదివారం సా॥ 6.00 గం॥లకు
వేదిక : అశోక్ నగర్ సంస్కృతి కేంద్రం, అశోక్‌నగర్, హైదరాబాద్-500020.

సభా కార్యక్రమం

ముఖ్య అతిథి : ఆచార్య టి. గౌరీశంకర్
పూర్వ రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
సభాధ్యక్షులు : ఆచార్య కడారి సత్యమూర్తి
అధ్యక్షులు - ఎబిబిఎస్ఎస్
గ్రంథావిష్కరణ : శ్రీ బైసా దేవదాస్
సంపాదకులు, నేటినిజం
గౌరవ అతిథులు : శ్రీ పడమటి బాల్‌రెడ్డి, గ్రంథ ప్రచురణ కర్త
శ్రీ బి. రామ్మూర్తి, అధ్యక్షులు - ఎసిడబ్ల్యుఎ
స్వాగతం : శ్రీమతి గోళ్ళమూడి పద్మావతి
అధ్యక్షులు, మహిళా విభాగం ఎబిబిఎస్ఎస్
కార్యక్రమ నిర్వహణ: శ్రీ తంగిరాల చక్రవర్తి, సెక్రటరీ, ఎబిబిఎస్ఎస్

కవి సమ్మేళనం

అందరూ ఆహ్వానితులే

శ్రీ బి. సూర్య ప్రకాశ్
సెక్రటరీ-ఎసిడబ్ల్యుఎ

శ్రీ తంగిరాల చక్రవర్తి
సెక్రటరీ-ఎబిబిఎస్ఎస్

# కార్చిచ్చులను కట్టడి చేస్తున్న అగ్నిమాపక దళాలు..!

**(04 మే 'అంతర్జాతీయ అగ్నిమాపక దళ దినం' సందర్భంగా)**

తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ధైర్యమనే ఉష్ణబంధక కవచం తొడుక్కొని మంటలను ఆర్పుతూ ప్రజలనే కాకుండా వారి ఆస్తిపాస్తులను కూడా కాపాడే మహత్తర విధులను నిర్వహించే అగ్నిమాపకదళ సైనికులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేయాలనే సంకల్పంతో జె జె ఎడ్మండ్‌సన్ స్థాపించిన 'అంతర్జాతీయ అగ్నిమాపకదళ దినోత్సవాన్ని' ప్రతి ఏటా 04 మే రోజున ప్రపంచదేశాలు నిర్వహిస్తున్నాయి. 04 జనవరి 1999న ఆస్ట్రేలియాలోని విక్టోరియా అడవుల్లో మంటలను ఆర్పే క్రమంలో ఐదుగురు అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోవడంతో వారి అద్వితీయ సేవలకు గుర్తుగా 04 మే రోజున ఈ దినోత్సవం పాటిస్తున్నారు.

## సేయింట్ ఫ్లోరియన్స్ స్మారక దినం:

ప్రపంచ తొలి రోమన్ బటాలియన్ అగ్నిమాపకదళ కమాండర్‌గా సేవలు అందించిన సేయింట్ ఫ్లోరియన్ స్మారకార్థం ఈ రోజున 'సేయింట్ ఫ్లోరియన్స్ డే'గా కూడా పాటించబడుతున్నది. పట్టణ, గ్రామ, పర్యావరణ, రక్షణరంగ, పారిశ్రామిక, ఏవియేషన్, మోటార్ స్పోర్ట్స్ రంగాల్లో అగ్నిమాపకదళం ఎల్లవేళల సిద్ధంగా ఉంటూ ఎనలేని మానవీయ సేవలను చేస్తూ మానవాళి మనసులు దోచుకుంటున్నారు. మంటలను ఏకైక శత్రువులుగా భావించి ఆవాసాలు, అడవులు, పరిశ్రమలు, కార్యాలయాలు, సంస్థలను మంటల నుంచి కాపాడటమే లక్ష్యంగా నిస్వార్థ సేవలను అందించే అగ్నిమాపక దళానికి మనందరం రుణపడి ఉండాలి.

## అవసరం సుశిక్షిత అగ్నిమాపక దళం:

మంటల్ని ఆర్పే మహాయజ్ఞంలో గాయపడిన క్షతగాత్రులకు సంఘీభావాన్ని తెలపడం, అమరుల వీరులకు నివాళులు అర్పించడం మన కనీస కర్తవ్యం. దేశ మానవ వనరులను, ఆస్తులను దగ్ధం కాకుండా కాపాడేందుకు మంటల్లోకి దూకి, మంటలతో పోరాడి, మంటలను మట్టి కరిపించి, సమాజహితానికి పాటుపడే దేశభక్తులుగా అగ్నిమాపకదళ సిబ్బంది మన ముందు ఆదర్శంగా నిలుస్తున్నారు. అగ్నికి సమయం, సందర్భం, విచక్షణ ఉండదు. సుశిక్షితులైన అగ్నిమాపకదళం మాత్రం ఎల్లవేళల సిద్ధంగా ఉంటూ, ఒక్క ఫోన్ కాల్‌తో నిమిషాల్లో అగ్ని ప్రమాద స్థలానికి కావలసిన అగ్నిమాపక పరికరాలతో చేరుతుంది. అంతర్జాతీయ అగ్నిమాపకదళ దినం రోజున సిబ్బంది, సామాన్య జనం నీలి (జల సంకేతం), ఎరుపు రంగు (మంటలకు సంకేతం) రిబ్బన్లను ధరించి అగ్నితో పోరులో అమరులకు శ్రద్ధాంజలి, కుటుంబ సభ్యులకు సంఘీభావం, క్షతగాత్రులకు ప్రగాఢ సానుభూతి ప్రదర్శించాలి. సాధారణంగా మే మాసపు తొలి ఆదివారం రోజున మధ్యాహ్నం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన సిబ్బంది మనశ్శాంతికి కొన్ని నిమిషాలు నిశ్శబ్దం పాటించే ఆచారం కూడా పాటించడం జరుగుతుంది.

## అగ్నిమాపక దళాల కొరతలో భారతం:

భారతదేశ జనాభా ఆధారంగా 8,559 అగ్నిమాపక కేంద్రాల అవసరం ఉండగా, ప్రస్తుతం 2,987 కేంద్రాలు మాత్రమే సేవలు అందిస్తున్నాయి. సాధారణ ప్రజలకు అత్యవసర సేవలు అందించడానికి నేషనల్ ఎమర్జెన్సీ ఫోన్ నెంబర్ 112, ఫైర్ 101, పోలీస్ 100, అంబులెన్స్ 102, ప్రకృతి విపత్తులు 108 టోల్ ఫ్రీ నెంబర్లు ప్రతి క్షణం అందుబాటులో ఉన్నాయి. అగ్నిమాపకదళంలో ప్రమాదకర పదార్థాల నిపుణులు, మంటలను ఆర్పే విభాగం, తాత్కాలిక అగ్నిమాపక సభ్యులు, స్వచ్ఛంధ కార్యకర్తలు, కార్చిచ్చు ఆర్పే విభాగం, భారీ పరికరాల నియంత్రణ చేసే విభాగం, అత్యవసర వైద్య విభాగం లాంటి పలు విభాగాల సభ్యులు ఉంటారు. దేశం, ప్రాంతం, వర్గం, మతం, కులం, భాష లాంటి భేదాలు లేకుండా అగ్నిమాపకదళం అనితరసాధ్య సేవలను అంకితభావం, త్యాగం, నిబద్ధత వంటి సూత్రాలను శ్వాసిస్తూ, మానవాళికి అనన్య సామాన్య సేవలు అందిస్తున్నారు.

నేటి ఆధునిక యుగంలో అమెజాన్, ఆస్ట్రేలియా అడవుల్లో తరుచుగా సంభవించే కార్చిచ్చులు అగ్నిమాపకదళానికే కాకుండా ప్రభుత్వాలకు కూడా పెను సవాళుగా నిలుస్తూ, పర్యావరణానికి తీవ్ర విఘాతాన్ని కలిగిస్తున్నాయి. అడవుల్లో చెలరేగే కార్చిచ్చులో మానవాళి, ఆవాసాలు, ఆస్తులతో పాటు అమూల్య వణ్యప్రాణులు, హరితవనాలు, వన సంపదలను కూడా కాపాడటంలో అగ్నిమాపక యోధుల పాత్ర అనిర్వచనీయం. అగ్నిమాపకదళ సభ్యుల అద్వితీయ సేవలను మానవ సమాజం మరువకుండా, సర్వదా కృతజ్ఞతా పూర్వకంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఎసి-ఇఎన్-సి ట్రైనింగ్ కమాండ్ పదవీ బాధ్యతల నుస్వీకరించిన ఎయిర్ మార్శల్ శ్రీ నాగేశ్ కపూర్

న్యూఢిల్లీ, మే 3:ఎయిర్ మార్శల్ శ్రీ నాగేశ్ కపూర్ 2024 మే నెల 1 వ తేదీ నాడు ట్రైనింగ్ కమాండ్ (టిసి) లో ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ (ఎఒసి-ఇఎన్-సి) గా పదవీ బాధ్యతల ను స్వీకరించారు.

ఎయిర్ మార్శల్ శ్రీ ఎన్. కపూర్ 1986 వ సంవత్సరం డిసెంబరు 6 వ తేదీ నాడు భారత వాయుసేన లో ఫైటర్ స్ట్రీమ్ లో తన సేవల ను ప్రారంభించారు. ఆయన నేశనల్ డిఫెన్స్ అకాడెమి, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ మరియు నేశనల్ డిఫెన్స్ కాలేజి లలో పూర్వపు విద్యార్థి. ఆయన కు ఒక క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్ మరియు ఫైటర్ కమ్బైట్ లీడర్ గా 3,400 గంటల కు మించిన విమాన చోదన సంబంధి అనుభవం ఉంది.

ఎయిర్ మార్శల్ తన అద్భుతమైన వృత్తి జీవనం లో అనేక ఫీల్డ్ అపాయింట్‌మెంట్ లతో పాటు స్టాఫ్ అపాయింట్‌మెంట్స్ ను నిర్వహించారు. ఆయన నిర్వహించినటువంటి ఆపరేశనల్ పదవుల లో సెంట్రల్ సెక్టర్ లో ఫైటర్ స్క్వాడ్రన్ కు కమాండింగ్ ఆఫీసర్, వెస్టర్న్ సెక్టర్ లో ఒక ఫ్లయింగ్ బేస్ కు స్టేశన్ కమాండర్ మరియు ఒక ప్రముఖ వాయు స్థావరాని కి ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ అనే టటువంటి బాధ్యతలు ఉన్నాయి. వీటికి అదనం గా, ఆయన వాయుసేన అకాడెమి లో ప్రధాన బోధకుడు (ఫ్లయింగ్) మరియు ప్రతిష్ఠాత్మకమైన డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజి, వెల్లింగ్‌టన్ లో డైరెక్టింగ్ స్టాఫ్ అనే పదవీ బాధ్యతల ను కూడా నిర్వహించారు. ఎయిర్ మార్శల్ శ్రీ నాగేశ్ కపూర్ ఎయిర్ ఫోర్స్ అకాడెమి లో తన పదవీ కాలం లో పిసి-7 ఎమ్‌కె ఐఎల్ విమానాన్ని భారత వాయు సేన (ఐఎఎఫ్) లో చేర్చుకోవడంతో పాటు ఆ విమానం యొక్క సేవల ను వినియోగి ంచుకోవడం లో ముఖ్య పాత్ర ను పోషించారు. ఆయన పాకిస్తాన్ లో డిఫెన్స్ అటాశీ గా దౌత్య పదవీ బాధ్యతల ను కూడా ను చేపట్టారు. ఆయన నిర్వహించినటువంటి స్టాఫ్ అపాయింట్‌మెంట్స్ విషయానికి వస్తే వాయు సేన ప్రధాన కేంద్రం లో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఆపరేశన్స్ (స్ట్రేటజీ), సౌథ్ వెస్టర్న్ ఎయిర్ కమాండ్ లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్ మరియు సెంట్రల్ ఎయిర్ కమాండ్ ప్రధాన కేంద్రం లో సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్ వంటివి ఉ న్నాయి. ఆయన ప్రస్తుత నియామకం తాలూకు బాధ్యత లను స్వీకరించడాని కంటే పూర్వం ఎయిర్ హెడ్ క్వార్టర్స్ లో ఎయిర్ ఆఫీసర్-ఇన్-ఛార్జ్ పర్సనెల్ గా సేవల ను అందించారు.

ఎయిర్ మార్శల్ శ్రీ నాగేశ్ కపూర్ కు ఆయన యొక్క ప్రశంసనీయమైన సేవ కు గుర్తింపు గానా అన్నట్లు 2008 వ సంవత్సరం లో వాయు సేన మెడల్ తో మరియు 2022 వ సంవత్సరం లో అతి విశిష్ట్ సేవా మెడల్ తో సమ్మానించడమైంది.

# మహిళా ఉద్యోగులకు స్వీయరక్షణ పట్ల జాగృతిని కల్పించడంకోసం కార్యశాలను నిర్వహించిన ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, మే 3:ఆత్మరక్షణ మెళకువలు సహా మహిళల కు సంబంధించిన అంశాల ను గురించి ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎమ్‌డిఒఎన్ఇఆర్) లోని మహిళా ఉద్యోగులు మరియు విజ్ఞాన్ భవన్ ను ఆనుకొని ఉన్న భవన సముదాయం లో విధుల ను నిర్వహించే సిఐఎస్ఎఫ్ అధికారుల తో కలసి ఒక సమావేశాన్ని అంతర్గత ఫిర్యాదుల సంఘం యొక్క చెయర్ పర్సన్, ఎమ్‌డిఒఎన్ఇఆర్ సంయుక్త కార్యదర్శి శ్రీమతి అనురాధ ఎస్. చగ్‌తీ నిర్వహించారు.

ఈ సమావేశం లో మోనాలిసా దాస్, జెఎస్; ఇంకా శ్రీమతి సుచితా గుప్త, ఎన్ఎ లు కూడా పాలుపంచుకొన్నారు.

సంఘం లో వెలుపలి సభ్యురాలు గా ఉన్న వైశాలి ధూత్ గారు మరియు సంఘం లోని ఇతర సభ్యులు కూడా ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ధూత్ గారు స్ట్రీబల్ ఫౌండేశన్ కు సిఇఒ గా ఉన్నారు. ఆమె అనుభవజ రాలు అయిన ఆత్మరక్ష శిక్షకురాలు మరియు తాయ్ క్వాండో యుద్ధ విద్య లో నాలుగో డిఎన్ బ్లాక్ బెల్ట్ గ్రహీత కూడాను.

ఈ సమగ్ర సమావేశం లో ప్రాథమిక చిట్కాల ను, స్థితి ని బట్టి ఎలా నడుచుకోవాలి అనే జాగరూకత ను, పిడిగుద్దులు, నిరోధం, ఇంకా ఇతర ఆత్మరక్షణ సంబంధి పద్ధతుల ను గురించి చర్చించడమైంది.

ధూత్ గారు మాట్లాడుతూ ఒక వ్యక్తి తన ను తాను కాపాడుకో వడానికి పెద్దపీట ను వేయవలసి ఉ ంది అని నొక్కి చెప్పారు.

అలాగే ఆత్మ రక్షణ సంబంధి శిక్షణ కు మరియు వ్యాయామానికి ప్రతి రోజు 10 నిమిషాల వంతు న అయినా కేటాయించుకోండి అంటూ సమావేశం లో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళ ను ప్రోత్సహించారు.

ఈ విధమైన నేర్పు వ్యక్తిగత సురక్ష కు పూచీ పడడం ఒక్కటే కాకుండా, ఇతరుల కు తోడ్పడుతూ వారిని రక్షించడంలోనూ మహిళల కు సత్తా ను అందిస్తుంది అని ఆమె అన్నారు.

# ఇంటి బయటే డొక్కు సైకిల్..సింకులోవాడేసిన గ్లాస్

**-మంచిచేసే ఫ్యాన్ ఇంటిలోనే ఉండాలి**
**-కూటమిని నమ్మితే అధోగతే**
**-జరిగేది కురుక్షేత్రం**
**-కులాల మధ్య కాదు.. ఇది క్లాస్ వార్**
**-ఒక్కసారి ఆలోచించండి**
**-నరసాపురంలో సీఎం జగన్ ప్రచారం**

అమరావతి, మే 3:చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకమైనా గుర్తుకొస్తుందా.. రైతులకు రుణమాఫీ చేస్తానన్నాడు.. చేశాడా?. రూ.87వేల కోట్ల రుణాలు మాఫీ అన్నాడు.. చేశాడా.. డ్వాక్రా రుణాలు రద్దు చేస్తానన్నాడు.. చేశాడా.. రాష్ట్రంలో జరుగుతోంది కులాల మధ్య యుద్ధం కాదు.. క్లాస్ వార్. మళ్లీ ఇదే కూటమి కొత్త కొత్త మోసాలతో వస్తోంది. ఇంటింటికి కేజీ బంగారం, బెంజి కారు ఇస్తారంట.. నమ్ముతారా..అని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి



ప్రశ్నించారు.పశ్చిమగోదావరి జిల్లా నరసాపు రంలో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడు తూ, మరోపది రోజుల్లో కురుక్షేత్ర యుద్ధం జరుగబోతోంది. ఈ ఎన్నికలు రాబోయే మీ ఇంటి భవిష్యత్తును, సంక్షేమ పథకాలను నిర్ణయిస్తాయి. ఎన్నికలు. ఒక్కసారి ఆలోచించి ఓటు వేయండి అని అన్నా రు. మీ బిడ్డను గెలిపిస్తే పథకాలు కొనసాగుతాయి, పొరబాటున చంద్రబాబుకు ఓటేస్తే పథకాలకు ముగింపు తప్పదని సీఎం జగన్ హెచ్చరించారు. చంద్రబాబుకు ఓటేస్తే చంద్రముఖిని తలుపు తట్టి లేపడమే. 14 ఏళ్లు సీఎంగా చంద్రబాబు ఒక్క మంచి పని అయినా చేశారా.. టీడీపీ పాలనలో ఏనాడైనా ఇలాంటి పథ కాలు అమలు చేశాడా.. చంద్రబాబు మూడు సార్లు ముఖ్య మంత్రిగా పని చేశానని చెప్పుకుంటా రు.చంద్రబాబును నమ్మడమంటే కొండ చిలువ నోట్లు తలపెట్టినట్టేనని సీఎం అన్నారు.

**ఇన్ని మంచి పనులు బాబు చేశాడా..**

రైతులకు పగటిపూటే తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. సకాలంలో ఇన్ పుట్ సబ్సిడీ అందిస్తున్నాం. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతన్నకు తోడుగా నిలిచాం. ప్రతీ రంగంలోనూ విప్లవం తీసుకువచ్చాం.ఈ పని చంద్రబాబు ఏనాడన్నా చేశాడా.. అని ప్రశ్నించారు. మీ బిడ్డ జగన్.. అక్కాచెల్లె మ్మల కు తోడుగా నిలబడ్డాడు. అక్కాచెల్లెమ్మలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాం. ఆసరా, సున్నావడ్డీ, చేయూతతో అక్కాచెల్లెమ్మలను ఆదుకున్నాం. అక్కాచెల్లెమ్మల కోసం కాపు నేస్తం, ఈబీసీ నేస్తం తీసుకొచ్చాం. 31లక్షల ఇళ్లపట్టాలు అక్కాచెల్లెమ్మలకు ఇచ్చాం, చంద్రబాబు ఏనాడన్నా ఇచ్చాడా.. ఒక్కసారి ఆలోచించండి , అని సీఎం జగన్ వివరించారు. పేదవాడి వైద్యం కోసం రూ.25లక్షల వరకు ఆరోగ్యశ్రీని విస్తరించాం. పేషంట్ విశ్రాంతి సమయంలోనూ ఆర్థిక సాయం అందించాం. ఆరోగ్య ఆసరా, ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్ల ద్వారా పేదవాడిని ఆదుకున్నాం. నాడు-నేడుతో ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మార్చాం అని గుర్తు చేశారు.

**డొక్కు సైకిల్ ఇంటి బయటే ఉండాలి**

జగనన్న తోడు, జగనన్న చేదోడతో చిరు వ్యాపారులకు సాయం అందించాం. గ్రామ సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం తెచ్చాం. రూ.2లక్షల 70వేల కోట్లు నేరుగా పేదల ఖాతాల్లో వేశాం. రెండు లక్షల 31వేల ఉద్యోగాలిచ్చాం, మీ బిడ్డ చేసిన పనిని గుర్తుంచుకోండి అని సీఎం జగన్ అన్నారు. వలంటీర్ల సేవలు కొనసాగాలంటే రెండు బటన్లు ఫ్యాన్ గుర్తుకే నొక్కాలి. పేదవాడి భవిష్యత్ కోసం రెండు బటన్లు ఫ్యాన్ గుర్తుకే నొక్కాలి. 175కు 175 అసెంబ్లీ, 25కు 25 ఎంపీ సీటు గెలవాల్సిందే. మంచి చేసిన ఫ్యాన్ ఇంట్లోనే ఉండాలి. చెడు చేసిన సైకిల్ ఇంటి బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ సింకులో నే ఉండాలి అని సీఎం జగన్ వ్యాఖ్యానించారు.

# పద్మ అవార్డులు 2025 కోసం మొదలైన నామినేషన్‌లు

న్యూఢిల్లీ, మే 3రాబోయే 2025 వ సంవత్సరం లో గణతంత్ర దినం సందర్భం లో ప్రకటించవలసి ఉన్నటువంటి పద్మ పురస్కారాలు 2025 కోసం ఆన్ లైన్ మాధ్యం లో నామినేశన్ లు/సిఫారసుల కార్యక్రమం ఈ రోజు న ఆరంభం అయింది. పద్మ పురస్కారాల కోసం నామినేశన్ లకు చివరి తేదీ 2024 సెప్టెంబర్ 15 వ తేదీ గా ఉంది. పద్మ అవార్డులకై నామినేశన్ లు/రికమండేశన్లను జాతీయ పురస్కార పోర్టల్ https://awards.gov.inలో ఆన్ లైన్ మాధ్యం ద్వారా స్వీకరించడం జరుగుతుంది.

పద్మ పురస్కారాలు, అనగా 'పద్మ విభూషణ్', 'పద్మ భూషణ్', మరియు 'పద్మ శ్రీ' అవార్డులు దేశం లో అత్యున్నత పౌర పురస్కారాలు గా ఉన్నాయి. 1954 వ సంవత్సరం లో స్థాపించిన ఈ అవార్డుల ను ప్రతి ఏటా గణతంత్ర దినం సందర్భం లో ప్రకటిస్తుంటారు. ఈ అవార్డు లు 'విశిష్ట కృషి' కి గుర్తింపు ను ప్రసాదిస్తాయి. అన్ని రంగాల లో మరియు విభాగాల లో అంటే కళ, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక కృషి, సైన్స్ ఎండ్ ఇంజినీరింగ్, పబ్లిక్ అఫైర్స్, పౌర సేవ, వ్యాపారం మరియు పరిశ్రమ మున్నగు వాటిలో విశిష్టమైన, అసాధారణమైన మరియు మార్గదర్శకప్రాయమైన కార్యసాధనల కు/సేవ లకు గాను ఇస్తూ వస్తున్నారు. జాతి, వృత్తి, పదవి లేదా మహిళలు/పురుషులు అనే భేదాల కు అతీతం గా అందరు వ్యక్తులు ఈ పురస్కారాల కు అర్హులు. ప్రభుత్వ రంగ సంస్థల లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు మరియు శాస్త్రవేత్తలు మినహా, పద్మ పురస్కారాల కు అర్హులు కారు.

పద్మ పురస్కారాల ను "ప్రజా పద్మాలు" గా మార్చాలి అని ప్రభుత్వం కంకణం కట్టుకొన్నది. ఈ కారణం గా పౌరులు స్వీయ నామినేశన్ సహా వారి వారి నామినేశన్ లను, సిఫారసుల ను అందించవలసిందిగా అభ్యర్థించడమైంది. మహిళలు, సమాజం లోని బలహీన వర్గాలవారు, ఎస్‌సి లు ఎస్‌టిలు, దివ్యాంగ జనులు, మరి అలాగే సమాజాని కి స్వార్థరహితం గా సేవ చేస్తున్న అటువంటి వారు వారి వారి ఉత్కృష్టత, ఇంకా కార్యసాధనల పరం గా ప్రతిభావంతులు అయిన వారిని అచ్చం గా అర్హులను గుర్తించడం కోసం ఏకోన్ముఖ ప్రయాస ను చేపట్టవచ్చును.

పైన ప్రస్తావించిన పోర్టల్ లో లభ్యమయ్యే నిర్దిష్ట నమూనా లో అన్ని ప్రాసంగిక వివరాల ను గరిష్టం గా 800 పదాల కు మించకుండా ఒక ప్రస్తావన పత్రం సహా నామినేశన్ / సిఫారసు లలో పొందుపరచాలి. ఈ వివరాలు సిఫారసు ను ఉద్దేశించినటువంటి వ్యక్తి (అతడు లేదా ఆమె) కి సంబంధించిన కార్యక్షేత్రం లో / రంగం లో సిఫారసు కు ఏ విధం గా అర్హులో స్పష్టం గా తెలియజేసేవై ఉండాలి.

ఈ విషయం లో మరిన్ని వివరాల ను దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ యొక్క వెబ్ సైట్ (https://mha.gov.in)లో 'అవార్డ్ స్ ఎండ్ మెడల్స్' శీర్షిక న అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా, పద్మ అవార్డుల కు ప్రత్యేకం గా ఉద్దేశించిన పోర్టల్ (https://padmaawards.gov.in)లో కూడా వివరాలు లభ్యం అవుతాయి. ఈ పురస్కారాల కు సంబంధించిన విధి విధానాలు మరియు నియమాలు https://padmaawards.gov.in/AboutAwards.aspx లింకు లో దొరుకుతాయి.

# రాహుల్ గాంధీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క..



నిర్మల్, మే 3 : నిర్మల్ పట్టణంలోని క్రషర్ గుండు వద్ద ఈనెల 5న జరగనున్న రాహుల్ గాంధీ బహిరంగ సభ ఏర్పాట్లను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యంగా నిర్మల్ జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో జనాన్ని తరలించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులను ఆదేశించారు.

బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీటి, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరు సంక్షేమ పథకాలను ఇంటింట వివరించి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు పడేలా చూడాలని కార్యకర్తలకు సూచించాలని నాయకులకు హితబోధ చేశారు. సభాస్థలిని సందర్శించిన ఆమె వెంట డీసీసీ అధ్యక్షులు కే.శ్రీహరిరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, తదితరులు ఉన్నారు.

# రాజంపేటలో కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు ఖాయం : చంద్రబాబు

అమరావతి, మే 3:రాయచోటిలో శ్రీకాంత్ రెడ్డికి సరైన మొగుడు దొరికాడని, శ్రీకాంత్ రెడ్డికి రాంప్రసాద్ రెడ్డి సరైన ప్రత్యర్థి అని చంద్రబాబు అన్నారు. కూటమి అభ్యర్థి, బీజేపీ నేత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చేతిలో రాజంపేట వైసీపీ ఎంపీ అభ్యర్థి చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమైందని చంద్రబాబు అన్నారు. ఈ నెల 13వ తారీఖు మార్పుకు నాంది, గెలుపునకు పునాది అని అన్నారు.

అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఏర్పాటు చేసిన ప్రజాగళం సభకు టీడీపీ అధినేత చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. "సైకో జగన్ జగన్ మోహన్ రెడ్డి 99 శాతం మేనిఫెస్టో అమలు చేశానని చెప్పుకుంటున్నాడు. కానీ, 99 శాతం అమలు చేయలేదు. మేనిఫెస్టో అమలులో అతడికి గుండు సున్నా మార్కులు అని అన్నారు.రాయచోటికి ఏమైనా పనులు చేశాడా.. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ వచ్చిందా.. సొంత జిల్లాలో రైతుకు ఒక చిన్న పని, కనీసం ఒక సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేశాడా.. కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి మేలు చేశారు. ఆయన కేంద్రంలో కూడా పలుకుబడి ఉన్న వ్యక్తి. ఆయన గెలిస్తే ఈ ప్రాంతానికి న్యాయం జరుగుతుంది అని అన్నారు.

# మూడుసార్లు సీఎం అయ్యి చంద్రబాబు ఏం చేశారు- సీఎం జగన్

అమరావతి, మే 3:మూడుసార్లు సీఎంగా చేసిన చంద్రబాబు పేదలకు ఏం చేశారని సీఎం జగన్ ప్రశ్నించారు. నరసాపురంలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబు పేరు చెబితే గత పథ్నాలుగేళ్లలో ఒక్క పథకమైనా గుర్తుకు వస్తుందా.. అని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఓటేస్తే చంద్రముఖి నిద్రలేచి రక్తం తాగుతుందని అన్నారు.



పదిరోజుల్లో కురుక్షేత్ర యుద్ధం జరగబోతుందని, జగన్ కు ఓటేస్తే పథకాలు కొనసాగుతాయని, చంద్రబాబుకు ఓటేస్తే సంక్షేమ పథకాలకు ముగింపు తప్పదని హెచ్చరించారు. గత యాభై ఎనిమిది నెలల కాలంలోనే ఇన్ని పథకాలు ఇచ్చిన నేత ఎవరైనా ఉన్నారా.. అని జగన్ ప్రశ్నించారు. గతంలో ఎప్పుడైనా అవ్వాతాతలకు ఇంటి వద్దకు పింఛను తీసుకువచ్చిన పరిస్థితి ఉందా.. అని అడిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు కింద బాగుచేసి ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు.

నాడు నేడుతో విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చామని తెలిపారు. విదేశీ విద్యకింద అనేక మందిని ప్రోత్సహించామని తెలిపారు. పూర్తిస్థాయి ఫీజు రీఎంబర్స్‌మెంట్ చేస్తూ పేదల విద్య కోసం ఈ ప్రభుత్వం ఎంత పాటుపడిందో మీకు తెలియదా.. అని జగన్ ప్రశ్నించారు. అక్కాచెల్లెమ్మల పేరిట 36 లక్షల పక్కా ఇళ్లను మంజూరు చేసింది నిజం కాదా.. అని ప్రశ్నించారు. ఎవరి ప్రభుత్వంలో మహిళా సాధికారికత జరిగిందో తెలియదా.. అని ప్రశ్నించారు. ప్రతి విషయంలో ఆలోచన చేసి ఓటు వేయాలని జగన్ కోరారు.

కేవలం యాభై ఎనిమిది నెలల్లో మాత్రమే అమలయిన పథకాలను చూడాలని కోరారు. రైతన్నలకు పెట్టుబడి సాయంగా ఇస్తున్నామని చెప్పారు. రైతు భరోసా, పగటి పూట నాణ్యమైన విద్యుత్తు 9 గంటల సరఫరా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చింది నిజం కాదా.. అని ప్రశ్నించారు. రైతన్నలకు అండగా నిలిచిన ప్రభుత్వం ఇది కాదా.. అని అన్నారు. వైద్యం కోసం ఆరోగ్యశ్రీని 25 లక్షల రూపాయల వరకూ విస్తరించడం నిజం కాదా,... అని ప్రశ్నించారు. ఫ్యామిలీ డాక్టర్ ను ప్రవేశపెట్టింది మీ బిడ్డ పాలనలోనే కాదా.. అని అన్నారు. ఆలోచన చేయమని అడుగుతున్నానని అన్నారు. ఇవన్నీ గతంలో ఎప్పుడైనా చూశారా.. అంటూ ప్రశ్నించారు. చిరు వ్యాపారులకు కూడా జగనన్న తోడు, జగనన్నచేదోడు పథకాలతో అండగా నిలిచింది ఎవరు అని జగన్ ప్రశ్నించారు.

గత ఎన్నికల్లో ఓటు వేయని వారికి కూడా సంక్షేమ పథకాలను అందించామని తెలిపారు. ఇంట్లో కూర్చుని అందరితో మాట్లాడాలని, ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి మరీ ఓటు వేయాలన్నారు. వాలంటీర్లు మళ్లీ ఇంటికి రావాలన్నా, లంచాలు లేని పాలన కావాలన్నా, పేద వాడి భవిష్యత్ బాగుపడాలన్నా రెండు బటన్లు ఫ్యాన్ పై నొక్కాలని పిలుపు నిచ్చారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఇరవై ఐదు పార్లమెంటు స్థానాల్లో వైసీపీ గెలవాల్సిందేనని అన్నారు. చంద్రబాబు చేసే మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని అన్నారు. మంచి చేసిన ఫ్యాన్ ఇంట్లోనే ఉండాలని, చెడు చేసిన సైకిల్ ఇంటి బయటే ఉండాలని, తాగేసిన టీ గ్లాసు సింక్ లో ఉండాలన్నారు. అందరూ వైసీపీకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. మీ బిడ్డ ఒక్కడే ఒకవైపు ఉన్నాడని, మిగిలిన వారంతా మరొక వైపు ఉన్నారన్నారు.




# నౌక విధ్వంసక ఆయుధాన్ని సూపర్ సానిక్ మిసైల్ సహాయం తోవిడుదల చేసే వ్యవస్థను

## ఒడిశా కోస్తా తీరాని కి ప్రయోగాత్మకం గా పరీక్షించడం లోసఫలమైన డిఆర్‌డిఒ

న్యూఢిల్లీ, మే 3:సూపర్ సానిక్ మిసైల్-అసిస్టెడ్ రిలీజ్ ఆఫ్ టార్‌పీడో (ఎస్ఎమ్ఎఆర్‌టి - 'స్మార్ట్')) వ్యవస్థ ను 2024 మే నెల 1 వ తేదీ నాడు ఉదయం పూట సుమారు గా 8:30 గంట ల వేళ కు ఒడిశా యొక్క కోస్తా తీరాని కి ఆవల గల డాక్టర్ శ్రీ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ దీవి నుండి ప్రయోగాత్మకం గా పరీక్షించే ప్రక్రియ సఫలం అయింది. నౌక విధ్వంసక ఆయుధాన్ని సూపర్ సానిక్ మిసైల్ సహాయం తో విడుదల చేసే వ్యవస్థ యే 'స్మార్ట్'. స్మార్ట్ అనేది తరువాతి తరాని కి చెందిన క్షిపణి ఆధారితమైనటువంటి మరియు తక్కువ బరువు ను కలిగివుండేటటువంటి ఆయుధ వ్యవస్థ. ఈ టార్ పీడో యొక్క ఉపయోగం పేలోడ్ (ఉపగ్రహం మోసుకుపోయే విజ్ఞానశాస్త్ర సంబంధి సాధనం) మాదిరి గా ఉంటుంది. దీనిని భారతీయ నౌకాదళం యొక్క జలాంతర్గామి నిరోధక యుద్ధ సామర్థ్యాన్ని సామాన్య టార్ పీడో యొక్క సాంప్రదాయక పరిమితి కంటె బాగా ఎక్కువ గా పెంచడం కోసమని రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) ద్వారా తయారు చేయించడం తో పాటు గా అభివృద్ధి పరచడం కూడా జరిగింది.

కనిస్టర్-ఆధారితమైనటువంటి ఈ క్షిపణి వ్యవస్థ లో అనేక అడ్వాన్స్‌డ్ సబ్-సిస్టమ్స్ ను జత పరచడమైంది. వాటిలో రెండు దశల తో కూడినటువంటి దృఢమైన ప్రపల్షన్ సిస్టమ్, ఎలక్ట్రోమెకానికల్ ఏక్చుయేటర్ సిస్టమ్, ప్రిసిషన్ ఇనర్శియల్ నేవిగేశన్ సిస్టమ్ ల వంటివి ఉన్నాయి. ఈ వ్యవస్థ పారాశూట్ ఆధారితమైన విడుదల వ్యవస్థ తో పాటు ఉన్నతీకరించినటువంటి తక్కువ బరువు తో కూడిన టార్‌పీడో ను తనతో మోసుకుపోతుంది.

ఈ క్షిపణి ని గ్రౌండ్ మొబైల్ లాంచర్ ద్వారా ప్రయోగించడమైంది. ఇదే పరీక్ష లో భాగం గా సిమెట్రిక్ సెపరేశన్, ఇజెక్శన్ మరియు వేగ నియంత్రణ వంటి అనేక అత్యాధునిక సదుపాయాల పనితీరు ను నిశితం గా పరీక్షించడమైంది.

స్మార్ట్ ను విజయవంతం గా ప్రయోగించి పరీక్షించినందుకు డిఆర్‌డిఒ కు మరియు ఈ ప్రక్రియ లో తోడ్పాటు ను అందించిన రక్షణ పరిశ్రమ కు చెందిన ఇతర భాగస్వాముల కు రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింహ్ అభినందనలను తెలియ జేశారు. "ఈ వ్యవస్థ ను అభివృద్ధి పరచడం మన నౌకా దళం యొక్క బలాన్ని మరింత పెచి వేయగలదు" అని ఆయన అన్నారు.

యావత్తు స్మార్ట్ జట్టు యొక్క సహకారాత్మక ప్రయాసల ను రక్షణ విభాగం లో ఆర్‌డడి కార్యదర్శి మరియు డిఆర్‌డిఒ చెయర్ మన్ డాక్టర్ శ్రీ సమీర్ వి. కామత్ కొనియాడారు. ఉత్కృష్టత మార్గం లో ముందుకు సాగండంటూ వారికి ఆయన విజ్ఞప్తి చేశారు.

# సుప్రీం కోర్టుఉత్తర్వును పాటించడం కోసం సింబల్ లోడింగ్ యూనిట్స్ యొక్క నిర్వహణ మరియు నిలవల కు గాను ఆదేశాన్ని జారీ చేసినఇసిఐ

న్యూఢిల్లీ, మే 3:సంవత్సరం 2023 కు సంబంధించిన రిట్ పిటిశన్ (సివిల్) సంఖ్య 434 లో మాన్య సర్వోన్నత న్యాయస్థానం 2024 ఏప్రిల్ 26 వ తేదీ న ఇచ్చిన తీర్పునకు అనుగుణం గా భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) సింబల్ లోడింగ్ యూనిట్ (ఎస్ఎల్‌యు) ల యొక్క నిర్వహణ కు మరియు నిలవ కు గాను ఒక క్రొత్త ప్రోటోకాల్ ను జారీ చేసింది. ఎస్ఎల్‌యు ల నిర్వహణ మరియు నిలవ లకు గాను క్రొత్త ప్రోటోకాల్స్ ను అమలు పరచడాని కి అవసరమైన మౌలిక సదుపాయాల ను మరియు ఏర్పాటుల ను సిద్ధం చేసుకోవాలి అంటూ సిఇఒ స్ (ముఖ్య కార్యనిర్వహణ అధికారులు) అందరికీ ఆదేశాల ను ఇవ్వడమైంది.మాననీయ సర్వోన్నత న్యాయస్థానం ఆజ్ఞాపించిన ప్రకారం, సవరించిన ప్రోటోకాల్స్ 2024 మే 1 వ తేదీ నాడు గాని, లేదా ఆ తేదీ తరువాత గాని చేపట్టిన వివిపిఎటి లలో సింబల్ లోడింగ్ ప్రక్రియ ను పూర్తి చేయడాని కి సంబంధించిన అన్ని కేసుల లోను వర్తిస్తాయి

# అధికారంలోకి రాగానే.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. షర్మిల

**-ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న జగన్ సర్కార్!**
**-ఉద్యోగులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది**
**-ఓపీఎస్‌ను అమలు చేస్తాం..**
**-మేనిఫెస్టోకు కట్టుబడి ఉన్నాం..**
**-ఏపీపీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**



కడప , మే 3: రాష్ట్రంలో ఉద్యోగుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు.. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు మీ ముందు మోకరిల్లిలా.. వారిని ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ వారి హక్కులను కాలరాయడం బాధాకరమని ఏపీపీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ చెబుతున్న నవరత్నాలు నవ సందేహాలుగా మారాయన్నారు. వీటిపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 6 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వం పీడిస్తోందన్నారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఉద్యోగులకు ఫ్రీడమ్ ఇవ్వడంతో పాటు కలుపుకుపోయే వారని గుర్తుచేశారు. మరి అయన బిడ్డ జగన్ చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. కొంతమంది బొత్స లాంటి వారు బహిరంగంగా బెదిరించడం ఏంటి అని ప్రశ్నించారు.

ప్రభుత్వ ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని.. వారి గొంతు నొక్కడం సరికాదన్నారు. ఓపీఎస్ కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. ఉద్యోగుల డిమాండ్స్ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అన్ని విధాలా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. టీఏ, డీఏ కూడా ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగుల హెచ్ఆర్‌లోను కోత పెట్టారని విమర్శించారు. మరోవైపు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.22 వేల కోట్లు బకాయి పడిందని షర్మిల విమర్శించారు. చివరికి రూ.150 కోట్ల మెడికల్ బిల్లులనూ పెండింగ్ లో పెట్టారని ఆరోపించారు. వారి మొర ఆలకించే పరిస్థితే లేకుండా పోయిందన్నారు. ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని చెప్పారు.

12వ పీఆర్సీ అమలు చేయాల్సిన ప్రభుత్వం.. 11వ పీఆర్సీలోనే 4 శాతం కోతలు పెట్టిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఉద్యోగులను జగన్ ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఉద్యోగులను అన్నివిధాలా జగన్ మోసం చేశారని షర్మిల ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఓపీఎస్‌ను అమలు చేస్తుందని హామీ ఇస్తున్నామన్నారు. మేనిఫెస్టోకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ఉద్యోగుల హక్కులను పరిరక్షిస్తాం.. అండగా ఉంటామని, కాంగ్రెస్ పార్టీ భరోసా ఇస్తోందని షర్మిల తెలిపారు.

### వృద్ధుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం..

రాష్ట్రంలో పింఛన్ల పేరుతో వృద్ధుల ప్రాణాలతో జగన్ ప్రభుత్వం చెలగాటమాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధులను ఒక్కో నెల ఒక్కోరకంగా వీధుల్లోకీడ్చి పొట్టన పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. వృద్ధుల ఉసురు కొట్టుకోవద్దని సీఎస్‌కు సూచిస్తున్నానన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి తప్ప.. వైసీపీ పార్టీకి మేలు చేయాలని ఇంత ఘోరంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజాధనాన్ని జీతం గా తీసుకుంటూ పార్టీకి అనుకూలంగా పని చెయ్యడం సీఎస్‌కు తగదంటూ వ్యాఖ్యలు చేశారు. ఐఏఎస్ అధికారుల ను తమకు అనుకూలంగా వాడుకోవడం సరికాదని షర్మిల పేర్కొన్నారు.

# ఎఓసి-ఇఎన్-సి ట్రైనింగ్ కమాండ్ పదవీ బాధ్యతలను స్వీకరించిన ఎయర్ మార్శల్ శ్రీ నాగేశ్ కపూర్

న్యూఢిల్లీ, మే 3ఎయర్ మార్శల్ శ్రీ నాగేశ్ కపూర్ 2024 మే నెల 1 వ తేదీ నాడు ట్రైనింగ్ కమాండ్ (టిసి) లో ఎయర్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ (ఎఓసి-ఇఎన్-సి) గా పదవీ బాధ్యతల ను స్వీకరించారు.

ఎయర్ మార్శల్ శ్రీ ఎన్. కపూర్ 1986 వ సంవత్సరం డిసెంబరు 6 వ తేదీ నాడు భారత వాయుసేన లో ఫైటర్ స్ట్రీమ్ లో తన సేవల ను ప్రారంభించారు.

ఆయన నేశనల్ డిఫెన్స్ అకాడెమి, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ మరియు నేశనల్ డిఫెన్స్ కాలేజి లలో పూర్వపు విద్యార్థి. ఆయన కు ఒక క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్ మరియు ఫైటర్ కమ్బైట్ లీడర్ గా 3,400 గంటల కు మించిన విమాన చోదన సంబంధి అనుభవం ఉంది.

ఎయర్ మార్శల్ తన అద్భుతమైన వృత్తి జీవనం లో అనేక ఫీల్డ్ అపాయింట్‌మెంట్ లతో పాటు స్టాఫ్ అపాయింట్‌మెంట్స్ ను నిర్వహించారు. ఆయన నిర్వహించినటువంటి ఆపరేశనల్ పదవుల లో సెంట్రల్ సెక్టర్ లో ఫైటర్ స్క్వాడ్రన్ కు కమాండింగ్ ఆఫీసర్, వెస్టర్న్ సెక్టర్ లో ఒక ఫ్లయింగ్ బేస్ కు స్టేశన్ కమాండర్ మరియు ఒక ప్రముఖ వాయు స్థావరాని కి ఎయర్ ఆఫీసర్ కమాండింగ్ అనే టటువంటి బాధ్యతలు ఉన్నాయి. వీటికి అదనం గా, ఆయన వాయుసేన అకాడెమి లో ప్రధాన బోధకుడు (ఫ్లయింగ్) మరియు ప్రతిష్ఠాత్మకమైన డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజి, వెల్లింగ్‌టన్ లో డైరెక్టింగ్ స్టాఫ్ అనే పదవీ బాధ్యతల ను కూడా నిర్వహించారు.

ఎయర్ మార్శల్ శ్రీ నాగేశ్ కపూర్ ఎయర్ ఫోర్స్ అకాడెమి లో తన పదవీ కాలం లో పిసి-7 ఎమ్‌కె ఐఐ విమానాన్ని భారత వాయు సేన (ఐఎఎఫ్) లో చేర్చుకోవడంతో పాటు ఆ విమానం యొక్క సేవల ను వినియోగించుకోవడం లో ముఖ్య పాత్ర ను పోషించారు.

ఆయన పాకిస్తాన్ లో డిఫెన్స్ అటాశీ గా దౌత్య పదవీ బాధ్యతల ను కూడా ను చేపట్టారు. ఆయన నిర్వహించినటువంటి స్టాఫ్ అపాయింట్‌మెంట్స్ విషయానికి వస్తే వాయు సేన ప్రధాన కేంద్రం లో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ఎయర్ స్టాఫ్ ఆపరేశన్స్ (స్ట్రేటజీ), సౌథ్ వెస్టర్న్ ఎయర్ కమాండ్ లో ఎయర్ డిఫెన్స్ కమాండర్ మరియు సెంట్రల్ ఎయర్ కమాండ్ ప్రధాన కేంద్రం లో సీనియర్ ఎయర్ స్టాఫ్ ఆఫీసర్ వంటివి ఉన్నాయి.

ఆయన ప్రస్తుత నియామకం తాలూకు బాధ్యత లను స్వీకరించడాని కంటే పూర్వం ఎయర్ హెడ్ క్వార్టర్స్ లో ఎయర్ ఆఫీసర్-ఇన్-ఛార్జ్ పర్సనెల్ గా సేవల ను అందించారు.

ఎయర్ మార్శల్ శ్రీ నాగేశ్ కపూర్ కు ఆయన యొక్క ప్రశంసనీయమైన సేవ కు గుర్తింపు గానా అన్నట్లు 2008 వ సంవత్సరం లో వాయు సేన మెడల్ తో మరియు 2022 వ సంవత్సరం లో అతి విశిష్ట్ సేవా మెడల్ తో సమ్మానించడమైంది.

# భారత్ మార్కెట్లోకి ఫోర్స్ 5-డోర్ గుర్ఖా.. రూ.18 లక్షలతో షురూ..!

హైదరాబాద్, మే 3: ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోర్స్ మోటార్స్.. భారత్ మార్కెట్లో తన 5-డోర్ వర్షన్ ఆఫ్ రోడ్ ఎస్‌యూవీ 'గుర్ఖా'ను ఆవిష్కరించింది. గత నెల 29న ఏడు సీటర్ల ఎస్‌యూవీని ఫోర్స్ మోటార్స్ ప్రదర్శించింది. అయితే ఫోర్స్ మోటార్స్ 5-డోర్ ఆఫ్ డోర్ ఎస్‌యూవీ గుర్ఖా ధర రూ.18 (ఇంట్రడ్యూసరీ) లక్షలుగా నిర్ణయించింది. కార్ల ప్రీ బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. కస్టమర్లు అధికారిక డీలర్ షిప్ వద్ద రూ.25 వేల టోకెన్ సొమ్ము చెల్లించి కారు బుక్ చేసుకోవచ్చు. 3-డోర్ వర్షన్ గుర్ఖా కంటే 5-డోర్ గుర్ఖా కారు 425ఎంఎం పొడవైన వీల్ బేస్ కలిగి ఉంటుంది. మూడేండ్లు లేదా 1.5 లక్షల కి.మీ వారంటీ అందిస్తుంది. ఇందులో నాలుగు ఫ్రీ సర్వీసులు, ఒక ఏడాది పాటు రోడ్ సైడ్ అసిస్టెన్స్ అందిస్తుంది. మారుతి జిమ్నీ, 5-డోర్ మహీంద్రా థార్ కార్లతో పోటీ పడుతుంది గుర్ఖా.

3-డోర్ మోడల్ మాదిరే కనిపిస్తున్నా గుర్ఖా 5-డోర్ వర్షన్ ఉన్నా రెండు అదనపు తలుపులు, లాంగర్ వీల్ బేస్ ఉంటాయి. కారు ఫ్రంట్లో ఫాలోమీ హోం ఫంక్షన్, కార్నరింగ్ ఎల్ఈడీ డీఆర్ఎల్‌తోపాటు సర్క్యులర్ ఎల్ఈడీ హెడ్ లైట్స్ ఉంటాయి. రెండు హెడ్ లైట్ల మధ్య టూ స్లాట్ గ్రిల్లె జత చేశారు. స్టయిలిష్ బ్లాక్ కలర్ బంపర్, స్మాల్ ఎయిర్ డామ్, రౌండ్ ఫాంగ్ లాంప్స్ ఉంటాయి. సైడ్ ప్రొఫైల్ లో పొడవు పెరుగుతుంది. స్క్వేర్ ఆఫ్ వీల్ ఆర్చెస్, ఫ్యాక్టరీ ఫిటెడ్ స్నోకర్ల్స్, రూఫ్ రేక్ (ఆప్షనల్), న్యూ-18 అంగుళాల డ్యుయల్ టోన్ అల్లాయ్ వీల్స్, టెయిల్ గేట్ మౌంటెడ్ స్పేర్ వీల్, రూఫ్ రేక్ చేరుకోవడానికి నిచ్చెన, ఎల్ఈడీ టెయిల్ లైట్స్ ఉంటాయి. గ్రీన్, రెడ్, వైట్, బ్లాక్ రంగుల్లో లభిస్తుంది ఫోర్స్ మోటార్స్ ఆఫ్ రోడ్ ఎస్‌యూవీ 'గుర్ఖా'.

ఫోర్స్ 5-డోర్ గుర్ఖా కారు లోపల న్యూ 9.0అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ విత్ ఆపిల్ కార్ ప్లే, ఆండ్రాయిడ్ ఆటో కనెక్టివిటీ ఉంటుంది. అప్‌డేటెడ్ అప్‌హోల్‌స్టరీ, ఎక్స్ ట్రా సీటింగ్ రోస్ ఉంటాయి. 5-డోర్ గుర్ఖాలో సెకండ్ రో, థర్డ్ రోలో కెప్టెన్ సీట్స్ ఉంటాయి. డిజిటల్ డ్రైవర్ డిస్ ప్లే, పవర్డ్ ఓఆర్వీఎం, టిల్ట్ అండ్ టెలిస్కోపిక్ అడ్జస్టబుల్ స్టీరింగ్ వీల్, మాన్యువల్ ఏసీ విత్ రూఫ్ మౌంటెడ్ రేర్ వెంట్స్, ఆల్ పవర్ విండోస్ వంటి ఫీచర్లు ఉంటాయి. సేఫ్టీ కోసం డ్యుయల్ ఫ్రంట్ ఎయిర్ బ్యాగ్స్, త్రీ-పాయింట్ సీట్ బెల్ట్, ట్రాక్షన్ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్, స్పేర్ టైర్ తోపాటు టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్ విత్ రేర్ కెమెరా తదితర ఫీచర్లు ఉన్నాయి.

# కాంగ్రెస్, బీజేపీ మాయలో పడొద్దు.. సునీత జగదీష్ రెడ్డి



సూర్యాపేట, మే 3: కాంగ్రెస్, బీజేపీ మాయలో పడొద్దు.. మరోసారి పడి లోక్ సభ ఎన్నికల్లో మోసపోవద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సతీమణి, ఎస్ ఫౌండేషన్ చైర్మెన్ సునీత జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ లోక్ సభ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా సూర్యాపేట 38, 35 వార్డ్ లలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి గడప గడపకు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ? ఆరు గ్యారెంటీలంటూ మభ్యపెట్టి ప్రజలను కాంగ్రెస్ నిలువునా ముంచిందన్నారు. తెలంగాణాకు కేసీఆరే శ్రీరామరక్ష అన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున మీ పక్షాన ప్రశ్నించే గొంతుకగా కంచర్ల కృష్ణారెడ్డికి అవకాశమివ్వాలని కోరారు. ఉత్తమాటలు.. ఉద్దెరహామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను మరోసారి నమ్మి మోసపోవద్దని, పదేళ్ల పాలనలో తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీ మాయలో పడొద్దని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి అంటే కేసీఆర్ సర్కార్‌దేనని, పదేండ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పనైపోయిందని తీవ్రంగా విమర్శించారు. తాము ఓటు ఎందుకు వేశామని ప్రజలు బాధపడుతున్నారని, నాలుగు నెలల్లోనే అసహ్యించుకునే దుస్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పేరుమాళ్ళ అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్,వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, నాయకులు అంగిరేకుల నాగార్జున, ఆకుల లవకుశ, కెక్కెరేణి నాగయ్య, భైరు వెంకన్న, వల్దస్ జాని, తాహెర్ పాషా, బత్తుల జాని, రాపర్తి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఈసీ ఉత్తర్వుల తుంగలో తొక్కి..

## -జగన్ ఆడుతున్న పైశాచిక క్రీడలో...

# లబ్ధిదారులను వేధించి అధికార పార్టీకి లబ్ధి చేకూర్చడం బాధాకరం

**-సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చంద్రబాబు లేఖ**

అమరావతి, మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏపీలో పెన్షన్ల కోసం పెన్షన్‌దారులు అష్టకష్టాలు పడుతున్నారు. మండుటెండలో బ్యాంకుల వద్ద పెన్షన్‌దారులు పడిగాపులు కాస్తున్నారు. చాలా అకౌంట్లు ఇన్‌ఆపరేటివ్ అయి ఉండటంతో.. అకౌంట్లను ఆపరేషన్‌లోకి తెచ్చేందుకు ఆధార్ కార్డు కాపీతో సహా దరఖాస్తు ఇవ్వాలని బ్యాంక్ అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు. చదవురాని అనేక మంది పెన్షనర్లు దరఖాస్తులు నింపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అసలు తమకు పెన్షన్ అందుతుందా లేదా అనే ఆందోళనలో పెన్షన్‌దారులు ఉన్నారు. ఈ క్రమంలో పెన్షన్‌దారులు ఇబ్బందులపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్పందించారు.

సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డికి చంద్రబాబు లేఖ రాశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ముందు సామాజిక పెన్షన్ల లబ్ధిదారులను వేధించి అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రజల కోసం పని చేయాల్సిన ప్రభుత్వ అధికారి ప్రజలకు మేలు చేసే అవకాశాలను కనీసం కూడా ఆలోచించడం లేదన్నారు. ఒక రాజకీయ పార్టీకి కొమ్ము కాసేలా, ప్రజల్ని ఇబ్బందులకు గురి చేసేలా నిర్ణయాలు తీసుకోవడం అభ్యంతరకరం, అత్యంత దుర్మార్గమని లేఖలో తెలిపారు.

### ఈసీ ఉత్తర్వుల తుంగలో తొక్కి...

వృద్దులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర పెన్షన్ దారులు ఇబ్బందులు పడకుండా పెన్షన్ పంపిణీ సకాలంలో జరిగే అవకాశాలను పరిశీలించాలని ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 2న ఇచ్చిన మెమోలో పేర్కొందని.. అయినా ఆ ఉత్తర్వుల్ని తుంగలో తొక్కుతూ, గత నెలలో సచివాలయాల వద్ద బారులు తీరేలా చేసి 33 మంది ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యారని తెలిపారు. లక్షలాది మందిని వేధించారన్నారు. ఈనెల కూడా అదే విధంగా పెన్షన్ దారులను రోడ్లపై మండుటెండల్లో బ్యాంకుల చుట్టూ తిరిగేలా చేసి, నరకయాతనకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒక్క రోజులో పెన్షన్ల పంపిణీ పూర్తి చేసేంత వ్యవస్థ గ్రామస్థాయిలో ఉన్నప్పటికీ, ఇళ్ల వద్ద ఇవ్వకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. పెన్షన్ పంపిణీ పూర్తి చేసే అవకాశం ఉన్నా అలా చేయకుండా రాజకీయ కుట్రలకు ప్రాధాన్యమివ్వడం దుర్మార్గమన్నారు. రాజకీయంగా అధికార పార్టీ నాయకులు చేస్తున్న కుట్రలో భాగమై.. పెన్షన్ నగదును బ్యాంకుల్లో జమ చేయడం వలన పెన్షన్ సొమ్ము తీసుకోవడానికి వృద్ధులు ముప్పుతిప్పలు పడుతున్నారని ఆవేదన చెందారు. బ్యాంకులకు వెళ్లిన వారికి కేవైసీ పేరుతో బ్యాంకు సిబ్బంది ఆధార్, పాన్ తీసుకురమ్మని చెబుతున్నారని.. వాటి కోసం మండుటెండలో లబ్దిదారులు రోడ్లపై తిరగాల్సి వస్తోందన్నారు. మరోవైపు జాయింట్ ఖాతాలు, వ్యక్తిగత ఖాతాలు రెండూ ఉన్నవారికి ఏ ఖాతాలో నగదు జమయ్యిందో తెలియక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

### జగన్ ఆడుతున్న పైశాచిక క్రీడలో..

గత నెల మండుటెండలో సచివాలయాల చుట్టూ తిప్పారని.. ఇప్పుడు భారీగా మండిపోతున్న ఎండల్లో బ్యాంకుల చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నారని చెప్పారు. లబ్దిదారులు బ్యాంకులకు ఎలా చేరుకుంటారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఆడుతున్న రాజకీయ పైశాచిక క్రీడలో ప్రభుత్వ అధికారిగా ఉన్న సీఎస్ భాగస్వామిగా మారడం పక్షపాత వైఖరికి నిదర్శనమన్నారు. ఎక్కడో మండల కేంద్రాల్లో ఉన్న బ్యాంకుల చుట్టూ తిప్పుతూ దాదాపు దాదాపు 65 లక్షల మందిని అవస్థలకు గురి చేస్తున్నారన్నారు. గత నెలలో 35 మంది చనిపోతే, ఇప్పుడు ఒక్క రోజే దాదాపు 6గురు ప్రాణాలు కోల్పోయారన్నారు. "ఈ మారణ హోమానికి ఏ1 జగన్ రెడ్డి, ఏ2 వీరే'' అంటూ సీఎస్‌పై మండిపడ్డారు.ప్రస్తుతం రాష్ట్రంలో 43 నుండి 47 డిగ్రీల మధ్య ఉష్ణోగతలు నమోదవుతున్నాయి.. ఇలాంటి సమయంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధుల్ని, దివ్యాంగుల్ని ఇతర పెన్షన్ దారుల్ని బ్యాంకుల చుట్టూ తిప్పడం ఎంత మాత్రమూ సబబు కాదన్నారు. పేదల ప్రాణాలతో రాజకీయం చేయాలనుకోవడం ఇకనైనా మానుకోవాలని సూచించారు. తక్షణమే ప్రలబ్దిదారుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటింటికీ పెన్షన్లు అందించాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేస్తోందంటూ చంద్రబాబు లేఖ రాశారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుని ఓటింగ్ శాతాన్ని పెంచాలి: హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.




హన్మకొండ, మే 3 (నేటినిజం ప్రతినిధి) హనుమకొండ సుబేదారి లోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో స్వీప్ ఆధ్వర్యంలో ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఓటరు చైతన్య కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పెద్ద పండగ అయిన ఎన్నికల పోలింగ్ రోజున ఓటర్లు తప్పకుండ ఓటు వేయాలని అన్నారు. ఓటు వేసినప్పుడే ప్రశ్నించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామానికి మూలస్తంభమైన ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు వేయాలని ఢిల్లీ, ముంబై, కోల్ కొత, హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతుందని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతున్న నగరాల జాబితాలో వరంగల్ పశ్చిమ కూడా ఉందన్నారు.హనుమకొండ జిల్లాలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విభిన్న వర్గాలను ఓటరు చైతన్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. యువ ఓటర్లు ఓటు హక్కు కలిగిన తల్లిదండ్రులు, చుట్టు పక్కల వారిని ఎన్నికల్లో ఓటు వేసేవిధంగా చైతన్యం చేయాలన్నారు. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు యువత, విద్యార్థులు తమవంతు బాధ్యతగా ఓటర్లను ఓటు వేసే విధంగా చైతన్యవంతం చేయాలన్నారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమని పేర్కొన్నారు. ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హనుమకొండ స్వీప్ అడిషనల్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమేష్, అధికారులు మధురిమ, తదితరులతో పాటు అధ్యాపకులు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు కిట్స్ అందజేత



మహబూబ్‌నగర్, మే 3:ఈనాడు లక్ష స్పోర్ట్స్ క్లబ్ విద్యార్థులకు బికెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 విద్యార్థులకు(క్రీడా కారులకు) స్పోర్ట్స్ షూ, స్పోర్ట్స్ డ్రస్సులను బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ళ బాలకృష్ణ రెడ్డి అందజేశారు. ఇవాళ నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన క్రీడల్లో శిక్షణ పొందుతూ వివిధ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటుతున్న క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో డీకే ఆర్ ఫౌండేషన్ చైర్మన్ స్పోర్ట్స్ షూ స్పోర్ట్స్ డ్రెస్ లను అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్తల్ ప్రాంతంలో ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకలిగిన ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులు ఎందరు ఉన్నారని అలాంటి క్రీడాకారులను వెలిక తీసి వారికి మంచి శిక్షణ ఇచ్చి జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. క్రీడాకారులకు ఏ అవసరమున్న తనవంతు సహకారం ఎల్లవేళలా అందజేస్తానని అన్నారు. బాలబాలికలు క్రీడల్లో మంచి శిక్షణ పొంది ప్రతిభను చాటి ఈ ప్రాంతానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాల్సిందిగా ఈ సందర్భంగా బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి సూచించారు .ఏ సమయంలో ఏ అవసరం ఉన్నా పూర్తిగా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు జి.గోపాల్ రెడ్డి , పారేవుల విష్ణువర్ధన్ రెడ్డి,పసుల రంజిత్ రెడ్డి, చందాపూర్ రాములు,సాలంబిన్ ఉమర్ బ్రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బికేఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి తోపాటు ఇతర నాయకులను ఈనాడు లక్ష స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థిపై కేసు నమోదు

**-బండి సంజయ్‌పై ఫేక్ వీడియో, కాల్ రికార్డింగ్**
**-సోషల్ మీడియాలో పోస్ట్**
**-వెలిచాల రాజేందర్ రావుపై ఈసీకి ఫిర్యాదు**

కరీంనగర్, మే 3: తెలంగాణ లోక్సభ ఎన్నికల ప్రచారం రసవత్తరంగా సాగుతోంది. విమర్శలు, ప్రతివిమర్శలతో ప్రచారం హోరెత్తుతోంది. ప్రధాన పార్టీల నేతల మాటల తూటాలతో రాష్ట్రంలో దద్దరిల్లుతోంది. ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారంలో వారు చేసే కొన్ని వ్యాఖ్యలు, గెలుపు కోసం వారు చేసే కొన్ని పనులు వివాదానికి దారి తీస్తున్నాయి. కొన్నిసార్లు కేసులు నమోదు కూడా అవుతున్నాయి. తాజాగా ఇలాంటి ఘటనే కరీంనగర్లో చోటుచేసుకుంది. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.తన సొంత సోషల్ మీడియా ఖాతాలో కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ అనని మాటలను అన్నట్లుగా డీప్ ఫేక్ వీడియోలు, కాల్ రికార్డింగ్ సృష్టించి దుష్ప్రచారం చేశారన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వెలిచాలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి, పోలీసులకు బీజేపీ నేత కొట్టె మురళీ క్రిష్ణ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కొట్టె మురళీ క్రిష్ణ ఫిర్యాదుపై కరీంనగర్ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆదరించండి..అధిక మెజారిటీ అందించండి



ఖమ్మం, మే 3(నేటినిజం ప్రతినిధి): ప్రజలకు సేవ చేయాలని ఈ లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేశానని, అంతా ఆదరించాలని సీపీఐ, సీపీఎం బలపర్చిన ఖమ్మం కాంగ్రెస్ లోక్ సభ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాని రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం విన్ ఫీల్డ్ స్కూల్ సమీపంలో వైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. అంతా క్షేత్ర స్థాయిలో పర్యటించి..భారీ మెజారిటీ అందించాలని కోరారు. అనంతరం వారితో కలిసి.. అల్పాహారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, సీనియర్ నాయకులు మద్దినేని స్వర్ణ కుమారీ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహమ్మద్ జావేద్, గుర్రం తిరుమల రావు, చావా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వీడియో కాన్ఫరెన్స్ వద్దు.. నేరుగా కోర్టుకు హాజరు పరచాలి

## –కోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు కవిత

న్యూఢిల్లీ, మే 03 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత జ్యూడీషియల్ కస్టడీ మే 7వ తేదీతో ముగియనుంది. దీంతో ఆమెను కోర్టు ముందు హాజరుపరచనున్నారు అధికారులు. అయితే, తనను కోర్టుకు నేరుగా హాజరుపరచాలని.. వీడియో కాన్ఫరెన్స్ వద్దని కోర్టును కోరారు కవిత. ఈ మేరకు కోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు కవిత.ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవిత విచారణ ఖైదీగా తీహార్ జైల్లో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్నారు. అయితే, గతంలో కస్టడీ ముగిసినప్పుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను కోర్టు ధర్మాసనం ఎదుట హాజరుపరిచారు అధికారులు. ఇప్పుడు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరుపరిచే అవకాశం ఉంది. దీంతో.. ఈ విచారణకు నేరుగా హాజరుపరచాలని కోరుతూ కోర్టు అప్లికేషన్ పెట్టుకున్నారు కవిత.ఈ కేసులో కవిత అరెస్టైనప్పటి నుంచి నాలుగుసార్లు కస్టడీని పొడించింది రౌస్ అవెన్యూ కోర్టు ధర్మాసనం. కోర్టుకు హాజరైన సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసే అవకాశం ఏర్పడింది. అయితే, గతంలో కోర్టులో విచారణకు హాజరైన కవిత.. మీడియాతో మాట్లాడారు. ఈ చర్యపై ట్రయల్ కోర్టు జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తదుపరి విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు అధికారులు. కానీ, ఈసారి అలా చేయబోనని.. తనను నేరుగా కోర్టుకు హాజరుపరచాలని కోర్టును కోరారు ఎమ్మెల్సీ కవిత. మరి దీనిపై న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే తెలియాలి.

# రిజిస్ట్రేషన్ భూమిని ఆక్రమించేందుకు కుట్ర

## –పలుమార్లు కోర్టుకు వెళ్లిన తీర్పు మావైపే
## –ఆక్రమణదారులతో ప్రాణహాని ఉంది రక్షణ కల్పించండి
## –విలేకరుల సమావేశంలో బాధితుడు వాసిరెడ్డి శ్రీనివాసరావు

ఖమ్మం, మే 3(నేటినిజం ప్రతినిధి): తమకు చెందిన రిజిస్ట్రేషన్ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అటువంటి వ్యక్తులు మాపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అటువంటి వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం నగరానికి చెందిన బాధితుడు వాసిరెడ్డి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.




ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మా నాన్న వాసిరెడ్డి నాగేశ్వరరావు 1997లో వెలుగుమట్ల సర్వేనెంబర్ 494లో ఓబుల్ రెడ్డికి చెందిన రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామన్నారు. ఓబుల్ రెడ్డికి ఉన్న మొత్తం 10 ఎకరాల్లో మా కుటుంబం 2 ఎకరములు, కోనా శారద 4 ఎకరములు, మిగిలిన 4 ఎకరములు 2005లో ఓబుల్ రెడ్డి వారసులైన రాములమ్మ, కొండారెడ్డి, వెంకట సుమతి, భారతి ప్లాట్లు చేసి ఐదుగురికి అమ్మేరు. అమ్మే క్రమంలో మాకు తెలియకుండా మేము కొనుగోలు చేసిన రెండెకరాలకు కూడా డిక్లరేషన్ చేసి ఇచ్చారు. 2007లో అనుమోలు భాస్కరరావు, రాంప్రసాద్ అనేవారు అక్రమంగా జిపిఏ పొంది మాభూమి లో కూడా వెంచర్ వేసేందుకు ప్రయత్నించగా కోర్టుకు వెళితే 2013లో మాకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. వారి నుండి మరలా అదే భూమిని చేపూరి సంధ్యారాణి, చేపూరి పద్మలు కొనుగోలు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2013లో ఇంజక్షన్ ఆర్డర్ తీసుకొని వస్తే 2019లో కోర్టు కొట్టువేసి మాకే అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఓబుల్ రెడ్డి వేలిముద్రలు ఫోర్జరీ చేశామని కేసువేసి వేదిస్తే మా డాక్యుమెంట్స్ పరిశీలించి 2017లో మాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. మా రెండు ఎకరాల భూమికి ఫెన్సింగ్ వేసిన తొలగిస్తున్నారు. సంధ్యారాణి పద్మల స్వగ్రామం బయ్యారం వారిపై అనేక కేసులు ఉన్నాయని, బీసీలు అయి ఉండి అక్రమ పద్ధతిలో ఎస్సీ సర్టిఫికెట్ తెచ్చుకొని ఎంపీపీగా ఎన్నికైతే కలెక్టర్ ఆ పదవిని రద్దు చేశారు. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చిన తాసిల్దారును కూడా సస్పెండ్ చేశారు. వారి వలన మా కుటుంబానికి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని, అదేవిధంగా మా భూ పత్రాలు, కోర్టు తీర్పులు పరిశీలించి న్యాయం చేయాలని వేడుకున్నారు. విలేకరుల సమావేశంలో మీగడ వెంకటకృష్ణ, ముళ్ళ కిషోర్ తదితరులున్నారు.

# కేసీఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయం

## –బాంబ్ పేల్చిన బీజేపీ ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమంటూ బాంబ్ పేల్చారు.

హైదరాబాద్‌ను యుటీ చేయాలని కేటీఆర్ కలలు కంటున్నారంటూ విమర్శలు గుప్పించారు.

శుక్రవారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీనే రిజర్వేషన్లకు వ్యతిరేకమని అన్నారు. వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని అంబేద్కర్ చెప్తే.. ముస్లిం రిజర్వేషన్లను తెరపైకి తెచ్చారన్నారు. రిజర్వేషన్ల గురించి మాట్లాడితే కాంగ్రెస్ అంబేద్కర్‌ను అవమానించిందని విమర్శించారు.

కులాల పేరు మీద రిజర్వేషన్లు వద్దనేది రాజీవ్ గాంధీ వాదనన్నారు. రేవంత్ రెడ్డి ది కాంగ్రెస్ బ్లడ్ కాదని.. రేవంత్ కాంగ్రెస్ నేతలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ముస్లింలకు రిజర్వేషన్‌లను హైకోర్టు కొట్టివేస్తే.. సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారన్నారు.

# అబద్ధాల కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు : ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



సూర్యపేట, మే 3 : అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటుతోనే బుద్ధి చెబుతారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా జిల్లాలోని పెన్ పహాడ్ మండలం నువ్వు దూపాడు గ్రామంలో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని మాటిచ్చి ఇంతవరకూ అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామంటూ ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేనని విమర్శించారు. ఎన్నికలు ఉన్న సమయంలోనే రైతుబంధు నాలుగెకరాల వరకు ఇచ్చేందుకు నాలుగు నెలలు పట్టిందని, ఎన్నికల తతంగం పూర్తయితే అదికూడా నిలిపివేస్తారని, ఈ విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు.

అన్ని వర్గాలకు కొండంత అండ కేసీఆరే అన్న జగదీష్ రెడ్డి, బీఆర్ఎస్ పాలనకు ప్రస్తుత ప్రభుత్వ పాలనను ప్రజలే బేరీజు వేసుకోవాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. మన మన పిల్లల భవిష్యత్తు కోసం మే13న కారు గుర్తుకు ఓటు వేసి కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేషంను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

# జనం భూములను దోచుకోవడానికే జగన్ కొత్త చట్టం : పవన్‌కల్యాణ్

అమరావతి, మే 3 ఏపీలో తీసుకొస్తున్న ల్యాండ్ టైటిలింగ్‌చట్టంపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కైకలూరులో జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో చర్చ లేకుండానే రాష్ట్రంలో భూములను దోచేసే కొత్త చట్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకొచ్చారని మండిపడ్డారు.

మన ఆస్తి..మనదని 90 రోజుల్లో రుజువు చేసుకోలేకపోతే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ఆరోపించారు. ప్రజల వద్ద ఉన్న ఆస్తిని ప్రభుత్వం వద్ద రుజువు చేసుకోవాలా అంటూ ప్రశ్నించారు. ఆధార్ కార్డును తీసుకు రావాడానికి దశాబ్దం పాటు వాదోపవాదాలు జరిగిన తరువాత తీసుకొచ్చారని గుర్తు చేశారు. అదే ఏపీలో ల్యాండ్ టైటిలింగ్ చట్టం తీసుకు రావాలంటే ఎవరి అంగీకారం అవసరం లేదా అని నిలదీశారు.

కేంద్రం తీసుకొచ్చిన చట్టం ముసాయిదా మాత్రమేనని దానిపై చర్చ లేకుండానే ఎలా అమలు చేస్తారని పేర్కొన్నారు. ప్రజల ఏపీ ప్రజల భవిష్యత్ కోసం పార్టీలను ఏకం చేసి కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటి చేస్తున్నామని, వైసీపీకి ఓటేస్తే ప్రజల ఆస్తులు గాలిలో పెట్టిన దీపంలా ఆరిపోతాయని అన్నారు. యువతను గంజాయి మత్తుకు బానిస చేస్తున్నారని, ప్రజలు నిర్భయంగా బతకాలంటే కూటమిని గెలిపించాలని కోరారు.

# రిజర్వేషన్లపై ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలి : ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, మే 3:ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలో 13 బీసీ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీసీ ప్రజల్లో ఉన్న రిజర్వేషన్ల అపోహాలు, బీజేపీ పార్టీపై ఉన్న మచ్చ తొలగిపోవాలంటే ప్రభుత్వం చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి నిజాయితీని నిరూపించుకోవాలని సూచించారు. బీజేపీ పార్టీ రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను ఎత్తివేయాలని కుట్ర పన్నుతుందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు సమాధానాలు చెప్పాలని కోరారు. రిజర్వేషన్లపై వైఖరిని వెల్లడించకపోతే బీసీలంత కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్, నీల వెంకటేశ్, నందగోపాల్, వేముల రామకృష్ణ, ఉదయ్, రాజ్‌కుమార్,రమాదేవి, శివ, ప్రవీణ్,జ్యోతి పాల్గొన్నారు

# యాదాద్రి జిల్లాలో వడదెబ్బతో వ్యక్తి మృతి

యాదాద్రి భువనగిరి, మే 3 రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగకు ప్రజలు విలవిలలాడిపోతున్నారు. మండుటెండలకు ఉక్కపోత కూడా తీవ్రమైంది. దీంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ దెబ్బకు పలువురు మృత్యువాత పడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లాభువనగిరి మండలం అనంతారం గ్రామానికి చెందిన నర్సిరెడ్డి(63) అనే వ్యక్తి వడదెబ్బతో మృతి చెందాడు. భువనగిరి పట్టణంలో బైక్ పై వెళ్తుండగా ఎండ దాటికి తట్టుకోలేక కుప్పకూలిన నర్సిరెడ్డిని స్థానికులు దవాఖానకు తరలించారు. అప్పటికే నర్సిరెడ్డి చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. పూర్తి వివవరాలు తెలియాల్సి ఉంది.


శ్రీలేఖ సాహితి, వరంగల్

ఆహ్వానము

చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కారం

12-05-2024 సాయంత్రం 5.00 గంటలకు
గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు గారి గృహములో
జూబ్లీ హిల్స్, హైదరాబాద్

ముఖ్య అతిథి
"పద్మవిభూషణ్" గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు
మాజీ ఉపరాష్ట్రపతి, భారత ప్రభుత్వం

సభాధ్యక్షులు
డా॥ రేవూరి అనంత పద్మనాభరావు

సత్కారములు
శ్రీమతి శ్రీదేవి మురళీధర్
హైదరాబాద్

డా॥ వైష్ణవ వేంకటరమణమూర్తి
నంద్యాల

శ్రీ గార రంగనాథం
రాజాం, విజయనగరం జిల్లా

పుస్తకావిష్కరణలు
శ్రీభాష్యము – కరదీపిక
వేదాంత దేశికులు – హంస సందేశము


# బీఆర్ఎస్‌కు మరో బిగ్ షాక్.. ఎమ్మెల్సీ దండే విఠల్ ఎన్నిక చెల్లదు

## – తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్ మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పెద్ద సంఖ్యలో నేతలు అధికార కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అవడంతో డీలా పడ్డ బీఆర్ఎస్‌ను మరింత నిరుత్సాహ పరిణామం ఎదురైంది. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ దండే విఠల్ ఎన్నిక చెల్లదంటూ తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అతడి ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేత పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు నేడు (శుక్రవారం) తీర్పు వెలువరించింది.కాగా ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా 2022లో దండె విఠల్ ఎన్నికయ్యారు. . ఈ క్రమంలోనే దండె విఠల్‌కు రూ.50,000ల జరిమానా విధించింది. బీఆర్ఎస్ అధికారిక అభ్యర్థిగా దండే విఠల్ నామినేషన్ వేశారు. దీంతో టికెట్ ఆశించి భంగపడ్డ బీఆర్ఎస్ నేత పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. దీంతో రాజేశ్వర్ రెడ్డిని పోటీ నుంచి తప్పించడమే లక్ష్యంగా విఠల్ సంతకం పోర్జరీ చేశారు. రాజేశ్వర్ రెడ్డి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్టు ఫోర్జరీ సంతకాలతో రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు ఇచ్చింది. దీంతో రాజేశ్వర్ రెడ్డి నామినేషన్ ఉపసంహరణకు గురైంది. విషయాన్ని ఆలస్యంగా గ్రహించిన రాజేశ్వర్ కోర్టును ఆశ్రయించారు. తాను నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదని, నా సంతకాన్ని ఫోర్జరీ చేశారని కోర్టుకు తెలిపారు. దండే విఠల్ ఎన్నికను రద్దు చేయాలని కోరారు.

# 'సందేశ్‌ఖాలీపై మాట్లాడటానికి ముందు..': బీజేపీపై విరుచుకుపడ్డ మమతాబెనర్జీ

న్యూఢిల్లీ, మే 3:కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి తీవ్ర స్థాయిలో విరుచుకువడ్డారు. పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో.. రాజ్‌భవన్‌లోనే మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. సందేశ్‌ఖాలీపై నెలల తరబడి అసత్య ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

సందేశ్‌ఖాలీపై తెగ మాట్లాడుతున్న ప్రధాని గవర్నర్ వ్యవహారంపై ఎందుకు నోరు తెరవడం లేదని మమతాబెనర్జీ ఫైర్ అయ్యారు. సందేశ్‌ఖాలీపై మాట్లాడేముందు రాజభవన్‌లో గవర్నర్‌పై వచ్చిన ఆరోపణలపై మాట్లాడాలన్నారు. గవర్నర్ తనను లైంగికంగా వేధించాడని బెంగాల్ రాజ్‌భవన్‌లో కాంట్రాక్టు ఉద్యోగినిగా పనిచేస్తున్న ఓ మహిళ ఆరోపించారు. ఈ ఆరోపణలు ఇప్పుడు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి.గతంలో సందేశ్‌ఖాలీలో తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు షేక్ షాజహాన్‌పైన, టీఎంసీకే చెందిన ఇద్దరు జిల్లా పరిషత్ సభ్యులు ఉత్తమ్ సర్దార్, శిబూ హజ్రాపైన లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. మహిళలపై వారు ఇష్టారీతిగా అఘాయిత్యాలకు పాల్పడినట్లు పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో బీజేపీ నేతలు టీఎంసీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలో సందేశ్‌ఖాలీపై మాట్లాడేందుకు గవర్నర్‌పై మాట్లాడాలని మమత మండిపడుతున్నారు.

# హస్తం గూటికి చేరిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఖమ్మం మేయర్



ఖమ్మం, మే 3:బీఆర్ఎస్ పార్టీకి ఖమ్మంలో భారీ షాక్ తగిలింది. ఖమ్మం నగర మేయర్ నీరజ అధికార పార్టీలో చేరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. తుమ్మల ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మేయర్‌తో పాటు మరో ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.మేయర్ నీరజ, ఆమె భర్త బ్రహ్మంలు మొదటి నుంచి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు. దీంతో వారు కాంగ్రెస్‌లో చేరతారని మొదటి నుంచి ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు కార్పొరేటర్లలో 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపుడి రమాదేవి, 13వ డివిజన్ కార్పొరేటర్ నీరజ ఉన్నారు.

# ముస్లింల పట్ల కాషాయ పార్టీ తీరు సరైంది కాదు : శశి థరూర్

న్యూఢిల్లీ, మే 3 భారత్‌లో ప్రస్తుతం ముస్లింల పరిస్థితి హిట్లర్ హయాంలో యూధుల పరిస్థితిలా ఉందని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ తిరువనంతపురం అభ్యర్థి శశి థరూర్ స్పందించారు.

గత కొన్నేండ్లుగా దేశంలో ముస్లింలకు ఎదురైన అనుభవాలు మంచివి కాదని వ్యాఖ్యానించారు. దేశంలో ఇలా తొలిసారి జరుగుతోందని, లోక్‌సభ, రాజ్యసభలో కాషాయ పార్టీ నుంచి ఒక్క ముస్లిం లేరని, క్యాబినెట్‌లో ఒక్క ముస్లిం మంత్రి కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది బీజేపీ చేసిన తప్పిదమే అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో దేశం మొత్తం ప్రతిబింబించేదని, అన్ని వర్గాలకూ ప్రాతినిధ్యం ఉండేదని గుర్తుచేసుకున్నారు. కానీ కాషాయ పాలకులు హింద్, హిందూ, హిందుత్వ నినాదాలతో దేశ గుర్తింపును మార్చాలని కోరుకుంటున్నారని అన్నారు. ఇది మంచి పద్ధతి కాదని శశి థరూర్ హితవు పలికారు.

# పీవోకేలో ఘోర రోడ్డు ప్రమాదం.. 20 మంది దుర్మరణం

న్యూఢిల్లీ, మే 3:పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గిల్గిట్ బాల్టిస్థాన్ ఏరియాలోని దియామెర్ జిల్లాలో 41 మందితో ఇరుకైన కొండ మార్గంలో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలో పడింది. కారాకోరమ్ రహదారిపై యశోఖాల్ ఏరియాలో శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ప్రమాదంలో 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 21 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు.

# మే 6న ఈసెట్ ప్రవేశ పరీక్ష.. ఒక్క నిమిషం నిబంధన అమలు

హైదరాబాద్, మే 3: టీఎస్ ఈసెట్ ప్రవేశ పరీక్ష మే 6వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందే ఎగ్జామ్ సెంటర్ల వద్దకు చేరుకోవాలని అభ్యర్థులకు అధికారులు సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను ఎగ్జామ్ హాల్‌లోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. హాల్ టికెట్ తప్పనిసరిగా అధికారులకు చూపించాలని, ఆ తర్వాతే ఎగ్జామ్ హాల్‌లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు.

గుర్తింపు కార్డు కింద ఆధార్ కార్డు, కాలేజీ ఐడీ కార్డు, పాన్ కార్డు, పాస్ పోర్ట్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వాటిని చూపించాల్సి ఉంటుంది. క్యాలికులేటర్స్, లాగ్ టేబుల్స్, సెల్ ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.

ఈ పరీక్ష కోసం మొత్తం 99 కేంద్రాలను ఏర్పాటు చేయగా, తెలంగాణ జిల్లాల్లో 48, హైదరాబాద్ రీజియన్‌లో 44, ఏపీలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 24,272 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

